తెలంగాణ స్వరాష్ట్ర సమరయోధ పత్రిక
# జనంసాక్షి
www.janamsakshi.org
హైదరాబాద్ - రంగారెడ్డి
మేడ్చల్ మల్కాజిగిరి వికారాబాద్
శుక్రవారం
2 సెప్టెంబరు 2026
పేజీలు : 08
Follow :





# రాజ్యాంగం ప్రతి పౌరుడికి.. సమాన హక్కులు కల్పించింది

**ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీ విజిలెన్స్ అండ్ మానిటరింగ్ కమిటీ సభ్యులు కొంకణి విజయ్ కుమార్**

- ఓటు హక్కు అత్యంత శక్తివంతమైనది
- జనరల్లో ఎస్సీల విజయం ఓటు హక్కు కారణం
- ముకునూరులో పౌర హక్కుల దినోత్సవం

**రంగారెడ్డి, అక్టోబర్ 01 (జనంసాక్షి):** భారత రాజ్యాంగం ప్రతి పౌరుడికి సమాన హక్కులు కల్పించిందని ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీ విజిలెన్స్ అండ్ మానిటరింగ్ కమిటీ సభ్యులు శ్రీ కొంకణి విజయ్ కుమార్ అన్నారు. ఇబ్రహీంపట్నం మండల పరిధిలోని ముకునూరు గ్రామంలో తహసీల్దార్ అధ్యక్షతన పౌర హక్కుల దినోత్సవం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఓటు హక్కు అత్యంత శక్తివంతమైనదన్నారు. జనరల్ స్థానంలో ఎస్సీ అభ్యర్థి ఘన విజయం సాధించడం ఓటు హక్కు ద్వారానే సాధ్యమైందని పేర్కొన్నారు. ముకునూరు సర్పంచ్ సన్నాయిల ప్రేమ్ శిల్ప విజయమే దీనికి ప్రత్యక్ష నిదర్శనమని పేర్కొన్నారు. ప్రజలు మార్పును కోరుకుంటే కులం అడ్డుకాదని, ఓటే అసలైన నిర్ణాయక శక్తి అని స్పష్టం చేశారు. ఎస్సీ, ఎస్టీ విద్యార్థులు విదేశాల్లో ఉన్నత చదువులు అభ్యసించడానికి అంబేద్కర్ ఓవర్సీస్ విద్యా పథకం ఎంతో ఉపయోగ పడుతుందని తెలిపారు. ఆర్థిక ఇబ్బందులతో ఏ ఒక్క విద్యార్థి చదువు ఆగిపోకూడదనే ఉద్దేశంతో ప్రభుత్వం ఈ పథకాన్ని అమలు చేస్తోందని చెప్పారు. అర్హులైన విద్యార్థులు సద్వినియోగం చేసుకోవాలని కోరారు. సమాజంలో కుల వివక్షను రూపుమాపి, ఐక్యతను పెంపొందించడానికి ప్రభుత్వం కులాంతర వివాహం చేసుకున్న జంటలకు ఆర్థిక సహాయం అందిస్తోందని తెలిపారు. రైతు భరోసా, చేయూత పించన్లు, ఇందిరమ్మ ఇళ్లు, రేషన్ కార్డులు, ఆరోగ్యశ్రీ, కల్యాణ లక్ష్మి, షాదీ ముబారక్, దళిత బంధు తదితర ప్రభుత్వ సంక్షేమ పథకాలను అర్హులందరూ సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. మధ్యవర్తులను ఆశ్రయించకుండా నేరుగా అధికారులను సంప్రదించాలని కోరారు. ఎస్సీ, ఎస్టీలపై అన్యాయాలు జరిగితే అట్రాసిటీ చట్టం కింద కఠిన చర్యలు ఉంటాయని చెప్పారు. బాధితులకు తక్షణ రక్షణతో పాటు నష్టపరిహారం అందుతుందని వివరించారు. చివరగా గ్రామస్తుల సమస్యలను అధికారులు స్వయంగా స్వీకరించి, వాటి పరిష్కారానికి హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో ఇబ్రహీంపట్నం తహసీల్దార్ సునీతరెడ్డి, గ్రామ సర్పంచ్ సన్నాయిల ప్రేమ్ శిల్ప, ఉప సర్పంచ్, వార్డు సభ్యులు, మండల స్థాయి అధికారులు గ్రామ ప్రజలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

## దోమ తహసిల్దార్ కార్యాలయం వద్ద తీవ్ర ఉద్రిక్తత

**ఒంటిపై డిజిల్ పోసుకొని రైతుల ఆందోళన**



లోపలి పేజిలో

## ప్రసవానికి వచ్చిన తల్లి, బిడ్డను కాపాడలేని వైద్య వ్యవస్థ ఎందుకు?

- ప్రభుత్వ ఆసుపత్రిలో వైద్య సేవల వైఫల్యానికే తల్లి, బిడ్డ బలి.
- పేదల ప్రాణాలకు ప్రభుత్వం విలువ ఇవ్వదా?
- బాలమణి కుటుంబానికి రూ.25 లక్షల పరిహారం వెంటనే ప్రకటించాలి.
- బీసీ నేత రాజ్‌కుమార్ డిమాండ్.



## అనుమతులకు విరుద్ధంగా భారీ నిర్మాణం

**అధికారుల అండదండలపై ఆరోపణల**

రాజేంద్రనగర్,అక్టోబర్1(జనంసాక్షి) వా రాజేంద్రనగర్ సర్కిల్‌లో అక్రమ నిర్మాణాలకు అడ్డగా మారింది. సర్కిల్ పరిధిలోని గంధంగూడలో అనుమతులకు విరుద్ధంగా భారీ భవన నిర్మాణం చేపడుతున్నారు. భవనానికి కనీస సెట్ బాక్స్ కూడా లేకుండా 300 గజాలపై కేవలం జిం2 అనుమతులు ఉన్నప్పటికీ, అదనపు అంతస్తులతో పాటు సెల్లార్ నిర్మాణం పై అధికారుల పాత్ర పై మండిపడుతున్నారు. ఒకవైపు భవనానికి రంగులు వేసి పూర్తి చేసినట్లు కనిపించేలా చేస్తూనే, మరోవైపు లోపల మనం చేపడుతూ, వెలుపల అదనపు అంతస్తుల నిర్మాణ పనులు కొనసాగుతున్నాయి. అధికారుల నుంచి అవసరమైన ఎన్‌ఓసీలు పొందకముందే భవనంలోని దుకాణాలను యజమాని అద్దెకు ఇవ్వడంపై అధికారుల అవినీతికి నిదర్శనమని స్థానికులు పేర్కొంటున్నారు. అనుమతులకు విరుద్ధంగా నిర్మించిన అంతస్తులపై అధికారులు తక్షణమే తనిఖీ చేసి, నిబంధనల ప్రకారం చర్యలు తీసుకోవాలని స్థానికులు డిమాండ్ చేస్తున్నారు.



# బెల్టు జోరు!

- గాంధీ జయంతి రోజునైనా 'బెల్టు'కు బ్రేక్ పడేనా..?
- నిబంధనలు తుంగలో తొక్కుతున్న మద్యం వ్యాపారులు!


జనంసాక్షి
హైదరాబాద్ - రంగారెడ్డి
బెల్టుషాపుల చేతుల్లో
చట్టం బందీ?

**కొందుర్గు, జనంసాక్షి:** మహాత్మా గాంధీ జయంతి (అక్టోబర్ 2) సందర్భంగా ప్రభుత్వం అధికారికంగా వైన్ షాపులకు సెలవు (డ్రై డే) ప్రకటించినప్పటికీ, క్షేత్రస్థాయిలో మాత్రం మద్యం విక్రయాలు యథేచ్ఛగా సాగేలా కనిపిస్తున్నాయి. రంగారెడ్డి జిల్లా కొందుర్గు మండలంలో 'బెల్టు షాపుల' నెట్‌వర్క్ ఏ స్థాయిలో విస్తరించిందో గత అనుభవాలు స్పష్టం చేస్తున్నాయి. పవిత్రమైన స్వాతంత్ర్య దినోత్సవం (ఆగస్టు 15) వంటి 'డ్రై డే' రోజున కూడా నిబంధనలను పూర్తిగా తుంగలో తొక్కి, మద్యం ప్రియులకు అందుబాటులో ఉంచిన వ్యాపారులు.. ఇప్పుడు గాంధీ జయంతి రోజున కూడా అదే పంథాను కొనసాగిస్తారా? లేక అధికారులు కఠిన చర్యలు తీసుకుంటారా? అనే ప్రశ్నలు స్థానికంగా వెల్లువెత్తుతున్నాయి.

గతంలో స్వాతంత్ర్య దినోత్సవం రోజున ప్రభుత్వం అధికారికంగా 'డ్రై డే' ప్రకటించినప్పటికీ బెల్టు షాపుల్లో మద్యం ఏరులై పారింది. నిబంధనల ప్రకారం వైన్ షాపులు మూసి ఉన్నా, అంతకుముందే స్టాక్ నింపుకున్న బెల్టు షాపుల నిర్వాహకులు ఎక్కడికక్కడ బహిరంగంగా

లోపలి పేజిలో

# లింగంపల్లి-బోరబండ ఎంఎంటిఎస్ రైల్వే లైన్‌పై కనెక్టివిటీ అవకాశాలను పరిశీలించిన సిఎంసి కమిషనర్



**శేరిలింగంపల్లి, అక్టోబర్ 1 (జనంసాక్షి) :** సైబరాబాద్ మున్సిపల్ కార్పొరేషన్(సిఎంసి) పరిధిలో విపరీతమైన ట్రాఫిక్ సమస్యలు తలెత్తుతున్న నేపథ్యంలో ప్రత్యామ్నాయ మార్గాలలో భాగంగా గురువారం సైబరాబాద్ మున్సిపల్ కార్పొరేషన్ కమిషనర్ డాక్టర్ జి. సృజన ఓ సరికొత్త ఆలోచనకు తెర తీశారు. ఇందులో భాగంగా కూకట్‌పల్లి జోనల్ కమిషనర్ మయాంక సింగ్, సిపిఓ, హెచ్ఎండిఏ, సిఎంసి చీఫ్ ఇంజనీర్, ఇంజినీరింగ్ అధికారులు మరియు కన్సల్టెంట్లతో కలిసి లింగంపల్లి-బోరబండ ఎంఎంటిఎస్ రైల్వే లైన్‌పై అదనపు కనెక్టివిటీ కల్పించే అవకాశాలను పరిశీలించేందుకు ఆమె క్షేత్రస్థాయి పర్యటన నిర్వహించారు. ఇందులో భాగంగా హెచ్.కె.సి, ఫైనాన్షియల్ డిస్ట్రిక్ట్, కోకాపేట్ ప్రాంతాలను కూకట్‌పల్లి, నిజాంపేట్, మయూరి నగర్ ప్రాంతాలతో అనుసంధానించడంద్వారా రాకపోకలను మెరుగుపరచడం, అలాగే రైల్వే లైన్‌పై అదనపు కనెక్టివిటీ అవసరాన్ని దృష్టిలో ఉంచుకుని పలు ప్రత్యామ్నాయాలను క్షేత్రస్థాయిలో పరిశీలించారు. ఈ క్రమంలో మియాపూర్ మెట్రో స్టేషన్ మరియు మయూరి నగర్ వైపు కొత్త ఎలివేటెడ్ కారిడార్లు-కమ్-ఆర్ఓబీస్ ఏర్పాటు చేసే అవకాశం,
శిల్పా లేఅవుట్ నుంచి జేఎన్టీయూ మెట్రో స్టేషన్, నిజాంపేట్ ఎక్స్ రోడ్స్ వైపు కనెక్టివిటీ, ఇందులో అండర్‌పాస్ ఏర్పాటు చేసే అవకాశాన్ని కూడా కమిషనర్ పరిశీలించారు. హఫీజ్‌పేట్ మరియు కూకట్‌పల్లి ఆర్ఓబి లను నాలుగు లేన్ల నుంచి ఆరు లేన్లకు విస్తరించడం, కైతలాపూర్ ఆర్ఓబి నుంచి జీవాసిఎల్ రోడ్ మీదుగా కూకట్‌పల్లి హైవేకు కనెక్టివిటీ కల్పించే అవకాశాన్ని సైతం అంచనా వేశారు. యశోద హాస్పిటల్ సమీపంలోని ఎన్ఐఏ జంక్షన్ నుంచి హైటెక్స్-ముండికుంట మార్గం మీదుగా కొండాపూర్ వైపు రహదారి విస్తరణకు సాధ్యాసాధ్యాలను కూడా పరిశీలించారు. ప్రతిపాదిత మార్గాలను క్షేత్రస్థాయిలో పరిశీలిస్తూ ప్రస్తుతం ఉన్న రహదారి పరిస్థితులు, అందుబాటులో ఉన్న స్థలం, ట్రాఫిక్ రాకపోకలు మరియు అవసరమైన కనెక్టివిటీ అంశాలను ఈ సందర్భంగా అధికారులు సమీక్షించారు. కాగా ప్రతిపాదిత కనెక్టివిటీ మార్గాల సాధ్యాసాధ్యాలు, సాంకేతిక అవసరాలు మరియు క్షేత్రస్థాయి పరిస్థితులను మరింతగా పరిశీలించిన అనంతరం తదుపరి చర్యలు చేపట్టనున్నట్లు సిఎంసి అధికారులు తెలియజేశారు.

# ప్రసవానికి వచ్చిన తల్లి, బిడ్డను కాపాడలేని వైద్య వ్యవస్థ ఎందుకు?



**తాండూరు అక్టోబర్ 1(జనంసాక్షి) :**
జిన్ గుర్తి గ్రామానికి చెందిన బాలమణి ప్రసవం కోసం ప్రభుత్వ ఆసుపత్రికి వెళ్లగా, తల్లి, బిడ్డ ఇద్దరూ మృతి చెందిన విషాద ఘటన తీవ్ర ఆవేదనకు గురిచేసింది. వైద్య సేవల్లో జరిగిన లోపాలు, నిర్లక్ష్యమే ఈ ఘటనకు కారణమయ్యాయా. పేదల ప్రాణాలకు ప్రభుత్వ ఆసుపత్రుల్లో భద్రత లేదాఅని నియోజకవర్గ బీసీ సంఘం కన్వీనర్ కందుకూరి రాజ్‌కుమార్ ప్రభుత్వాన్ని సూటిగా ప్రశ్నించారు. బాలమణి తండ్రి పాలిష్ మిషన్‌లో లేబర్‌గా పనిచేస్తూ కుటుంబాన్ని పోషిస్తున్నారని, ముగ్గురు కుమార్తెల్లో బాలమణి పెద్ద కుమార్తె అని తెలిపారు. సుమారు సంవత్సరం క్రితం కర్ణాటకలోని సేడం సమీప గ్రామానికి వివాహం జరిగిన బాలమణి, గర్భం దాల్చిన అనంతరం ప్రసవం కోసం ప్రభుత్వ ఆసుపత్రికి వచ్చింది. అయితే తల్లి, బిడ్డ ఇద్దరూ మృతి చెందడం ఆ కుటుంబానికి తీరని నష్టాన్ని మిగిల్చిందన్నారు.
ప్రభుత్వం వెంటనే స్పందించి ఘటనపై ఉన్నతస్థాయి జరిపించాలని రాజ్‌కుమార్ డిమాండ్ చేశారు. బాలమణి కుటుంబానికి ప్రభుత్వం వెంటనే రూ.25 లక్షల ఆర్థిక సహాయం ప్రకటించి ఆదుకోవాలని డిమాండ్ చేశారు. పేద కుటుంబాలు ప్రభుత్వ ఆసుపత్రులకు వస్తే వారికి నాణ్యమైన వైద్యం, ముఖ్యంగా ప్రసవ సమయంలో అత్యవసర వైద్య సేవలు అందేలా ప్రభుత్వం బాధ్యత తీసుకోవాలని అన్నారు, రాజ్‌కుమార్ జిన్నూర్తి గ్రామానికి వెళ్లి బాలమణి కుటుంబ సభ్యులను పరామర్శించారు. కుటుంబానికి తమ వంతుగా ఆర్థిక సహాయం అందించి, అనంతరం అంత్యక్రియల్లో పాల్గొన్నారు. ఈ అంత్యక్రియల్లో రాష్ట్ర కార్యదర్శి సయ్యద్ షకూర్ వడ్డెర సమాజం అధ్యక్షులు రాములు, అంజి, హన్మంతు, సురేష్, వెంకటేష్, ప్రవీణ్, భీమశంకర్, రాజు, వినయ్, కృష్ణ తదితరులు పాల్గొని బాలమణి కుటుంబానికి సానుభూతి తెలిపారు.

# ఆరోగ్యకరమైన గుండె - సంతోషకరమైన జీవితం

## ప్రపంచ హృదయ దినోత్సవం సందర్భంగా అవగాహన ర్యాలీ



**హయత్ నగర్, అక్టోబర్ 1 (జనం సాక్షి) :** ప్రపంచ హృదయ దినోత్సవాన్ని పురస్కరించుకుని మహేశ్వరం ప్రభుత్వ జనరల్ ఆసుపత్రి (జి జి హెచ్) ఆధ్వర్యంలో హృదయ ఆరోగ్యంపై అవగాహన ర్యాలీ నిర్వహించారు. ఆసుపత్రి సూపరింటెండెంట్ డా. బి. నాగేందర్ ఆధ్వర్యంలో, జనరల్ మెడిసిన్ విభాగం హెచ్ ఓ డి డా. అనిల్ కుమార్ నిర్వహణలో ఈ కార్యక్రమం జరిగింది. "ఆరోగ్యకరమైన గుండె - సంతోషకరమైన జీవితం", "మీ గుండెను తెలుసుకోండి - ప్రాణాన్ని కాపాడుకోండి", "ఆరోగ్యకరమైన ఆహారం తినండి - గుండెను ఆరోగ్యంగా ఉంచుకోండి" వంటి నినాదాలతో ర్యాలీ నిర్వహిస్తూ రోగులు, వారి సహాయకులు, ఆసుపత్రి సిబ్బందిలో అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా డా. బి. నాగేందర్ మాట్లాడుతూ, మారుతున్న జీవనశైలి, ఒత్తిడి, అనారోగ్యకరమైన ఆహారపు అలవాట్ల కారణంగా గుండె జబ్బుల ముప్పు పెరుగుతోందన్నారు. క్రమం తప్పకుండా వ్యాయామం చేయడం, సమతుల్య ఆహారం తీసుకోవడం, ధూమపానం, మద్యపానానికి దూరంగా ఉండటంతో పాటు ఆరోగ్య పరీక్షలు చేయించుకోవాలని సూచించారు. డా. అనిల్ కుమార్ మాట్లాడుతూ అధిక రక్తపోటు, మధుమేహం, అధిక కొలెస్ట్రాల్, ఊబకాయం వంటి సమస్యలు గుండె జబ్బులకు ప్రధాన ప్రమాద కారకాలన్నారు. ఛాతీ నొప్పి, ఆయాసం, గుండె దడ వంటి లక్షణాలను నిర్లక్ష్యం చేయకుండా సకాలంలో వైద్యులను సంప్రదించా లని సూచించారు. ప్రతిరోజూ కనీసం 30 నిమిషాలు నడక వంటి వ్యాయామం చేయడం ఆరోగ్యానికి ఎంతో మేలు చేస్తుందని తెలిపా రు. ఈ కార్యక్రమంలో సి ఎస్ ఆర్ ఎమ్ ఓ డా. దామోదర్, డివిఎల్ హెచ్ఓడి డా. రాజీవ్ సింగ్, జనరల్ మెడిసిన్ విభాగం వైద్యులు, ఆర్ఎంఓలు, నర్సింగ్ సూపరింటెండెంట్, నర్సింగ్ సిబ్బంది, బి.ఎస్సీ నర్సింగ్ విద్యార్థులు, సిబ్బంది పాల్గొన్నారు.

# ఘనంగా కాంగ్రెస్ నాయకులు ప్రవీణ్ రెడ్డి పుట్టినరోజు వేడుకలు

**ఎల్బీనగర్, అక్టోబర్ 1 జనం సాక్షి :** ఎల్బీనగర్ కాంగ్రెస్ పార్టీ ఇన్‌చార్జి, ఆల్ ఇండియా ప్రొఫెషనల్స్ కాంగ్రెస్ చైర్‌పర్సన్ మధు యాష్కీ గౌడ్, టీపీసీసీ అధికార ప్రతినిధి దారిపల్లి రాజశేఖర్‌రెడ్డిని కాంగ్రెస్ నాయకుడు ప్రవీణ్ రెడ్డి మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా వారు ప్రవీణ్ రెడ్డికి జన్మదిన శుభాకాంక్షలు తెలిపి ఆశీస్సులు అందించారు.
ప్రజాసేవలో మరింత ఉత్సాహంతో ముందుకు సాగేందుకు వారి మార్గదర్శకత్వం ప్రేరణనిస్తుందని ప్రవీణ్ రెడ్డి తెలిపారు. కార్యక్రమంలో సీనియర్ కాంగ్రెస్ నాయకులు, డివిజన్ అధ్యక్షులు, మార్కెట్ డైరెక్టర్లు తదితరులు పాల్గొన్నారు.

# దోమ తహసిల్దార్ కార్యాలయం వద్ద తీవ్ర ఉద్రిక్తత

**దోమ అక్టోబర్ 01 జనం సాక్షి :** వికారాబాద్ జిల్లా దోమ మండలంలో భూ వివాదం తార స్థాయికి చేరింది. కుటుంబ భాగస్వామ్య పంపకాలు పూర్తి కాకముందే తమ దయాదాలు భూములను రియాక్టర్లకు అమ్ముతున్నారంటూ మోత్కూరు గ్రామ రైతులు తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. ఈ నేపథ్యంలో తమకు జరుగుతున్న అన్యాయాన్ని ప్రశ్నిస్తూ రైతులు దోమ తాసిల్దార్ కార్యాలయం ఎదుట పెద్ద ఎత్తున ఆందోళనకు దిగారు. అధికారులు స్పందించకపోవడంతో విసుగు చెందిన కొందరు రైతులు ఒంటిపై డీజిల్ పోసుకొని ఆత్మహత్యాయత్నానికి పాల్పడటంతో తాసిల్దార్ కార్యాలయ ప్రాంగణంలో ఒక్కసారిగా తీవ్ర ఉద్రిక్తత నెలకొంది. అకస్మాత్తుగా జరిగిన ఈ పరిణామంతో అప్రమత్తమైన పోలీసులు మరియు రెవెన్యూ అధికారులు వెంటనే రంగంలోకి దిగి ఆందోళనకారులను అడ్డుకున్నారు. ప్రాణాల మీదికి తెచ్చుకోవద్దని వారిని సముదాయించి ఆత్మహత్యాయత్నాన్ని భగ్నం చేశారు. బాధిత రైతుల సమస్యను సానుకూలంగా పరిశీలిస్తామని చట్టపరమైన చర్యలు తీసుకుంటామని అధికారులు హామీ ఇచ్చారు. వివాదాస్పద భూములకు సంబంధించి రిజిస్ట్రేషన్లు జరగకుండా తక్షణమే నిలిపివేస్తున్నట్లు రెవెన్యూ అధికారులు స్పష్టం చేయడంతో ఆందోళన విరమించారు..

# క్రీడల్లో మెరిసిన ఎంజేపీటీబీసీడబ్ల్యూఆర్ఎస్ విద్యార్థినులు

**కుస్తీలో ఆరు స్వర్ణ పతకాలు.. రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపిక**

**వాలీబాల్, ఖోఖోలోనూ జిల్లా స్థాయి పోటీలకు విద్యార్థినుల ఎంపిక**



**కీసర, అక్టోబర్ 01 (జనంసాక్షి) :** బోగారం క్యాంపస్‌లోని ఎంజేపీటీబీసీడబ్ల్యూఆర్ఎస్ ఘట్‌కేసర్, మల్కాజ్‌గిరి బాలికల పాఠశాల విద్యార్థినులు క్రీడల్లో ప్రతిభ చాటారు. ఉమ్మడి రంగారెడ్డి జిల్లా స్థాయి ఎస్‌జీఎఫ్ కుస్తీ పోటీల్లో అండర్-14, అండర్-17 విభాగాల్లో విద్యార్థినులు ఆరు స్వర్ణ పతకాలు సాధించి రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపికయ్యారు. అదేవిధంగా అండర్-14, అండర్-17 విభాగాల వాలీబాల్‌లో ముగ్గురు, ఖోఖోలో ముగ్గురు విద్యార్థినులు ఉమ్మడి రంగారెడ్డి జిల్లా స్థాయి పోటీలకు ఎంపికయ్యారు. ఈ సందర్భంగా పాఠశాల ప్రిన్సిపాల్ ఎల్లం సంతోషి విద్యార్థినులకు అభినందనలు తెలిపారు. క్రీడాకారిణులను తీర్చిదిద్దడంలో కృషి చేసిన ఫిజికల్ డైరెక్టర్ నవ్యరాణి, పీఈటీ పార్వతిని అభినందించారు. రాష్ట్రస్థాయి పోటీల్లోనూ విద్యార్థినులు ప్రతిభ కనబరచాలని ఆకాంక్షించారు.

# గాంధీ జయంతి రోజునైనా 'బెల్టు'కు బ్రేక్ పడేనా..?

విక్రయాలు సాగించారు. గ్రామీణ ప్రాంతాల్లో మద్యం మత్తులో వాహనాలు నడుపుతూ యువత ప్రమాదాల బారిన పడుతున్నా, ఎక్సైజ్ మరియు పోలీస్ శాఖ అధికారులు కనీస తనిఖీలు చేపట్టకపోవడంపై అప్పట్లో తీవ్ర విమర్శలు వచ్చాయి. చట్టాలు కేవలం కాగితాలకే పరిమితమా? లేక అక్రమార్కులకు చుట్టాలుగా మారాయా? అని ప్రజలు ఆగ్రహం వ్యక్తం చేశారు. కొందుర్గు మండల కేంద్రంలో లైసెన్స్ పొందిన వైన్ షాపులు కేవలం రెండు మాత్రమే ఉన్నప్పటికీ, ప్రతి గ్రామంలో నాలుగైదు బెల్టు షాపులు వెలిశాయంటే పరిస్థితి ఎంత తీవ్రంగా ఉందో అర్థం చేసుకోవచ్చు. అధికారిక వైన్ షాపులు మూసి ఉంచే రోజుల్లోనే ఈ బెల్టు షాపుల నిర్వాహకులకు అసలైన 'పండుగ'. పండగలు, జాతీయ సెలవు దినాల్లో మద్యం లభించని సమయంలో సాధారణ ధరల కంటే రెట్టింపు వసూలు చేస్తూ యథేచ్ఛగా అక్రమ దందా సాగిస్తున్నారు. మామూళ్ల మత్తులో జోగుతున్న కొందరు అధికారులు ఈ అక్రమాలను చూసీచూడనట్లు వదిలేస్తున్నారనే ఆరోపణలు అనేకంగా ఉన్నాయి. మద్యపాన నిషేధాన్ని బలంగా కాంక్షించిన మహాత్మా గాంధీ జయంతి రోజున కూడా ఇలాంటి అక్రమ మద్యం విక్రయాలు జరిగితే అది ఆ మహనీయుడిని అవమానించడమే అవుతుంది. గతంలో స్వాతంత్ర్య దినోత్సవం రోజున జరిగిన ఉల్లంఘనలను దృష్టిలో ఉంచుకొని, ఈ గాంధీ జయంతి రోజునైనా ఎక్సైజ్ మరియు పోలీస్ అధికారులు ప్రత్యేక నిఘా ఉంచాలని మండల ప్రజలు, యువజన సంఘాలు డిమాండ్ చేస్తున్నాయి. గ్రామాల్లో విచ్చలవిడిగా నడుస్తున్న బెల్టు షాపులపై కఠినంగా వ్యవహరించి, 'డ్రై డే' నిబంధనలను ఉల్లంఘించే వారిపై చట్టపరమైన చర్యలు తీసుకోవాలని స్థానికులు కోరుతున్నారు. ఈ సారైనా అధికారులు నిద్రమత్తు వదిలి చర్యలు తీసుకుంటారో.. లేక ఎప్పటిలాగే 'మామూలు'గా వదిలేస్తారో వేచి చూడాలి.

# బీజేపీ కార్మిక విభాగం మీడియా కన్వీనర్‌గా గంటి నగేష్ శర్మ



**ఎల్బీనగర్ అక్టోబర్ 1 (జనం సాక్షి)** తెలంగాణ రాష్ట్ర బీజేపీ కార్మిక విభాగం మీడియా కన్వీనర్‌గా గంటి నగేష్ శర్మ నియమితులయ్యారు. రాష్ట్ర కార్మిక విభాగం కన్వీనర్, సీనియర్ నాయకుడు అందె శ్రీనివాస్ చేతుల మీదుగా రాష్ట్ర బీజేపీ కార్యాలయంలో నియామకపత్రాన్ని అందుకున్నారు. ఈ సందర్భంగా నగేష్ శర్మ మాట్లాడుతూ తనపై నమ్మకంతో బాధ్యతలు అప్పగించిన అందె శ్రీనివాస్‌కు కృతజ్ఞతలు తెలిపారు. రాష్ట్రంలోని వివిధ రంగాల కార్మికుల సమస్యలను అధికారుల దృష్టికి తీసుకెళ్లి పరిష్కారానికి కృషి చేస్తానని, కార్మికుల హక్కుల పరిరక్షణకు నిరంతరం పాటుపడతానని తెలిపారు. పార్టీ క్రమశిక్షణకు కట్టుబడి కార్మిక విభాగాన్ని బలోపేతం చేసేందుకు చురుకైన పాత్ర పోషిస్తానన్నారు. కార్యక్రమంలో రాష్ట్ర కో-కన్వీనర్ ఆకుల శ్రీనివాస్, సూర్యాపేట లేబర్ సెల్ ఇన్‌చార్జి పాలకుర్తి శేషగిరిరావు, జిల్లా కన్వీనర్లు, జిల్లా ఇన్‌చార్జిలు, ఐటీ విభాగం, స్కిల్డ్ లేబర్ విభాగం నాయకులు పాల్గొన్నారు.

# బీజేపీ ఓబీసీ మోర్చా నాగర్‌కర్నూల్ జిల్లా ప్రధాన కార్యదర్శిగా ఇమ్మడి మహేష్



**తలకొండపల్లి అక్టోబర్ 01 (జనంసాక్షి):** భారతీయ జనతా పార్టీ నాగర్‌కర్నూల్ జిల్లా ఓబీసీ మోర్చా ప్రధాన కార్యదర్శిగా తలకొండపల్లి మండలంలోని వెంకట్రావు పేట గ్రామ సర్పంచ్ ఇమ్మడి మహేష్ నియమితులయ్యారు. ఈ మేరకు గురువారం బీజేపీ రాష్ట్ర నాయకత్వం ఉత్తర్వులు జారీ చేసింది. గత కొన్నేళ్లుగా పార్టీలో క్రియాశీలకంగా పనిచేస్తూ, వెంకట్రావుపేట సర్పంచ్ గా గ్రామ అభివృద్ధికి కృషి చేస్తున్న మహేష్ సేవలను గుర్తించి పార్టీ ఈ బాధ్యతను అప్పగించిదని వారు పేర్కొన్నారు. ఓబీసీ సామాజిక వర్గం నుండి వచ్చిన మహేష్ కు మంచి పట్టు ఉండటంతో జిల్లా వ్యాప్తంగా మోర్చాను బలోపేతం చేసేందుకు ఈ నియామకం ఉపయోగపడు తుందని పార్టీ భావిస్తోంది. ఈ సందర్భంగా ఇమ్మడి మహేష్ మాట్లాడుతూ..నాపై నమ్మకం ఉంచి ఈ బాధ్యతను అప్పగించిన రాష్ట్ర పార్టీ నాయకత్వా నికి, తల్లోజు ఆచారికి, జిల్లా అధ్యక్షులు జెట్టి వెంకటేష్‌కి, ఓబీసీ మోర్చా రాష్ట్ర, జిల్లా నాయకులకు హృదయపూర్వక కృతజ్ఞతలు తెలిపారు. ఈ పదవిని ఒక హోదాగా కాకుండా ఓబీసీ సమాజా నికి, పార్టీకి సేవ చేసే గొప్ప అవకాశంగా భావిస్తు న్నానన్నారు. పార్టీ సిద్ధాంతాలకు కట్టుబడి, సీనియర్ నాయకుల మార్గదర్శక త్వంలో, కార్యకర్తల సహకారంతో ఓబీసీ మోర్చాను గ్రామ స్థాయి నుండి జిల్లా స్థాయి వరకు మరింత బలోపేతం చేసేందుకు అంకితభావంతో పనిచేస్తానని స్పష్టం చేశారు. మహేష్ నియామకం పట్ల జిల్లా బీజేపీ నాయకులు, కార్యకర్తలు, వెంకట్రావుపేట గ్రామస్తులు హర్షం వ్యక్తం చేస్తూ అభినందనలు తెలిపారు.

# మోమిన్ పేట మండలంలో సుడిగాలి పర్యటన చేసిన జిల్లా కలెక్టర్ దీపక్ తివారి



**మోమిన్ పేట ,అక్టోబర్ 1(జనంసాక్షి) :** పంట పొలాల్లో పామ్ పాండ్ లను నిర్మించుకునే విధంగా రైతులకు అవగాహన కల్పించాలని జిల్లా కలెక్టర్ దీపక్ తివారీ అధికారులను ఆదేశించారు. గురువారం మోమిన్ పేట మండలం కొలుకుంద గ్రామ పరిసరాల్లోనీ విబి జి రామ్ జి కింద చేపడుతున్న పనులతో పాటు కస్తూరిబా విద్యాలయం, ప్రాథమిక ఆరోగ్య కేంద్రం సౌకర్యాలు, గ్రామపంచాయతీలో నిర్వహిస్తున్న ఎస్ఐఆర్ ప్రక్రియ జిల్లా కలెక్టర్ క్షేత్రస్థాయిలో పర్యటించి ఆకస్మిక తనిఖీలు చేశారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ..అదేవిధంగా జలసిరి పథకం గురించి ప్రజలకు తెలియజేస్తూ గ్రామాల్లో విబి జి రామ్ జి కింద రాంజీ చేపడుతున్న పనులలో భాగంగా పెద్ద మొత్తంలో ఇంకుడు గుంతలు, పొలాల వద్ద నీటి గుంతలు ఏర్పాటు చేసుకునే విధంగా ప్రోత్సహించాలన్నారు. పనుల నాణ్యతలో రాజీ పడవద్దని, మస్టర్ రోల్ లను సక్రమంగా నిర్వహిస్తూ కూలీలకు సకాలంలో వేతనాలు చెల్లించే విధంగా చర్యలు తీసుకోవాలని కలెక్టర్ అధికారులను ఆదేశించారు. ఎల్నినో ప్రభావంతో భూగర్భ జలాలు తగ్గుముఖం పడతాయని ఇంకుడు, నీటి గుంతలు ఏర్పాటు చేసుకోవడం వల్ల ముందు తరాలకు ఎంతగానోదోహదపడుతుందని దీనికి అధికారులు ప్రత్యేక శ్రద్ధ చూపాలని కలెక్టర్ తెలిపారు చంద్రాయన పల్లిలోని కస్తూరిబా విద్యాలయంలో నూతనంగా నిర్మిస్తున్న భవన పనులను త్వరితగతిన చేపట్టే విధంగా చర్యలు తీసుకోవాలని అధికారులకు సూచించారు. విద్యాలయ ప్రాంగణంలో పరిశుభ్రంగా ఉండేవిధంగా చూడాలని అదే విధంగా మురుగు నీరు నిలవకుండా తగు చర్యలు తీసుకోవాలని అధికారులు ఆయన సూచించారు. మండల ప్రాథమిక ఆరోగ్య కేంద్రం తనిఖీలలో భాగంగా అవుట్ పేషంట్ రిజిస్టర్, మందుల నిల్వ, ల్యాబ్, సిబ్బంది హాజరు పట్టీకలు ఆయన పరిశీలించారు. వైద్యులు సమయపాలన పాటించాలని, గర్భిణీలకు, బాలింతలకు నిరంతర వైద్య సేవలు అందించాలని సూచించారు. ఆసుపత్రిలో ప్రసూతి వివరాలను జిల్లా కలెక్టర్ వైద్యాధికారిని అడిగి తెలుసుకున్నారు.

మోమిన్ పేట గ్రామపంచాయతీ కార్యాలయంలో జరుగుతున్న ఓటరు జాబితా ప్రత్యేక సమగ్ర సవరణ పనులు, నూతనంగా ఓటరు గా నమోదు చేసుకున్న ఫారం-6 లను కలెక్టర్ పరిశీలించారు. 18 ఏళ్లు నిండిన ప్రతి ఒక్కరిని ఓటరుగా నమోదు చేయాలని, తప్పులు లేకుండా జాబితా రూపొందించాలని కలెక్టర్ ఆదేశించారు. ఈ పర్యటనలో జిల్లా విద్యాధికారి అబ్దుల్ ఘని , తహసీల్దార్ మునీరుద్దీన్, ఎంపీడీఓ సృజన, వైద్యాధికారి బుచ్చిబాబు, ఎంఈఓ నరసింహులు, ఏపీఓ శంకరయ్య, ప్రిన్సిపాల్ పద్మావతి, సర్పంచులు విశాల సంగమేశ్వర్ ,శివ కుమార్, సంధ్యా సుభాష్ గౌడ్,పంచాయతీ కార్యదర్శులు ఇందిర, ప్రవీణ్ తదితరులు పాల్గొన్నారు.

# ఏఐఎస్ఎఫ్ రాష్ట్ర సహాయ కార్యదర్శిగా సామిడి వంశీ వర్ధన్ రెడ్డి ఏకగ్రీవ ఎన్నిక



**హయత్ నగర్, అక్టోబర్ 1 (జనం సాక్షి) :** అఖిల భారత విద్యార్థి సమాఖ్య (ఏఐఎస్ఎఫ్) తెలంగాణ రాష్ట్ర సమితి ఆధ్వర్యంలో హనుమకొండలో ఘనంగా నిర్వహించిన 90వ వార్షికోత్సవ సభల్లో హయత్‌నగర్‌కు చెందిన, ఏఐఎస్ఎఫ్ రంగారెడ్డి జిల్లా కార్యదర్శి కామ్రేడ్ సామిడి వంశీ వర్ధన్ రెడ్డిని రాష్ట్ర సహాయ కార్యదర్శిగా ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. విద్యార్థుల సమస్యలపై నిరంతరం పోరాటాలు నిర్వహిస్తూ, వారి హక్కుల కోసం చురుకుగా పనిచేస్తున్న వంశీ వర్ధన్ రెడ్డి సేవలను గుర్తించిన రాష్ట్ర నాయకత్వం ఆయనకు ఈ కీలక బాధ్యతలను అప్పగించింది. ఈ సందర్భంగా వంశీ వర్ధన్ రెడ్డి మాట్లాడుతూ, తనపై నమ్మకం ఉంచి రాష్ట్ర సహాయ కార్యదర్శిగా బాధ్యతలు అప్పగించిన రాష్ట్ర, జిల్లా నాయకత్వాలకు హృదయపూర్వక కృతజ్ఞతలు తెలిపారు. రాష్ట్ర స్థాయిలో బాధ్యత లభించడంతో విద్యార్థుల పక్షాన తన బాధ్యత మరింత పెరిగిందని అన్నారు. రంగారెడ్డి జిల్లాలో విద్యార్థులు ఎదుర్కొంటున్న సమస్యలను రాష్ట్ర స్థాయిలో బలంగా వినిపించి, వాటి పరిష్కారం కోసం నిరంతరం పోరాడుతానని ఆయన తెలిపారు. ముఖ్యంగా ఏళ్ల తరబడి పెండింగ్‌లో ఉన్న ఫీజు రీయింబర్స్‌మెంట్, స్కాలర్‌షిప్ బకాయిలను వెంటనే విడుదల చేయడంతో పాటు, ప్రభుత్వ విద్యాసంస్థల్లో మౌలిక వసతుల కల్పన కోసం భవిష్యత్తులో మరిన్ని పోరాటాలు నిర్వహిస్తామని స్పష్టం చేశారు. విద్యార్థుల హక్కులు, విద్యా రంగ సమస్యల పరిష్కారం కోసం ఏఐఎస్ఎఫ్ ఆధ్వర్యంలో ఉద్యమాలను మరింత బలోపేతం చేస్తామని వంశీ వర్ధన్ రెడ్డి తెలిపారు.

# చీమల దరి గ్రామంలో త్వరలో ప్రారంభించనున్న ప్రాథమిక ఆరోగ్య కేంద్రం

- తీరనున్న ప్రజల కష్టాలు..గ్రామాన్ని అన్ని రంగాల్లో అభివృద్ధి పరుస్తా
- గ్రామ సర్పంచ్ ఎల్లా కొండ కల్పనా హరీష్ కుమార్ రెడ్డి





**మోమిన్ పేట, అక్టోబర్ 1,( జనం సాక్షి) :** మోమిన్ పేట మండల పరిధిలోని చీమలదరి గ్రామంలో ప్రారంభం కానున్న ప్రాథమిక ఆరోగ్య కేంద్రం, స్థానిక ప్రజలతో పాటు మారుమూల గ్రామాల ప్రజలకు అందుబాటులోకి రానున్నది గ్రామాన్ని అన్ని రంగాల్లో అభివృద్ధి పరిచి గ్రామ ప్రజలకు ఎలాంటి సమస్యలు తలెత్తకుండా చూడాల్సిన బాధ్యత తమపై ఉందని చీమలదరి గ్రామ సర్పంచ్ కల్పనా హరీష్ కుమార్ రెడ్డి పేర్కొన్నారు, గతంలో నిర్మించిన ప్రాథమిక ఆరోగ్య కేంద్రం పశువుల ఆసుపత్రి భవనం, అసంపూర్తిగా ఉండడంతో తాను గెలిచిన తర్వాత స్థానిక స్పీకర్ గడ్డం ప్రసాద్ కుమార్ సహకారంతో ప్రాథమిక ఆరోగ్య కేంద్రం భవనం పశువుల ఆసుపత్రి భవనం పూర్తిగా నిర్మించడం జరిగిందని అతి త్వరలో ప్రజలకు మూగజీవాలకు అందుబాటులోకి రానున్నాయని ఆమె తెలిపారు, తనపై ప్రజలకు ఉన్న విశ్వాసాన్ని వమ్ము చేయకుండ ఏకగ్రీవంగా ఎన్నుకున్న ప్రజలకు ఏదో ఒకటి అవసరపడే పనులు చేయాలని లక్ష్యంతో అభివృద్ధి పనులకు శ్రీకారం చుట్టానని ఆమె తెలిపారు, ప్రజల తో పాటు మూగజీవాలకు సైతం ఎన్నో ఇబ్బందులు ఎదుర్కొనే వారిని త్వరలో ప్రభుత్వ ప్రాథమిక ఆరోగ్య కేంద్రం పశువుల ఆసుపత్రి వినియోగంలోకి రానున్నాయని ఆమె తెలిపారు, ప్రజల అవసరాల కోసం ఎన్ని నిధులైన ఖర్చు చేసి అభివృద్ధి కోసం ప్రజల పక్షాన నిలిచి అభివృద్ధిపరిచే బాధ్యత తనపై ఉందని ఆమె అన్నారు వార్డు సభ్యుల గ్రామ ప్రజల మండల స్థాయి అధికారుల సహకారంతో మరింత అభివృద్ధి పనులు చేసి ముందుకు వెళ్తానని ఆమె వివరించారు

# నిన్నటి తరం అందించిన విలువలే నేటి సమాజానికి బలమైన పునాది

**బిఆర్ఎస్ ఎల్పీ విప్, ఎమ్మెల్యే కేపీ.వివేకానంద్**



**కుత్బుల్లాపూర్ అక్టోబర్ 1(జనంసాక్షి) :** ప్రపంచ వయోవృద్ధుల దినోత్సవాన్ని పురస్కరించు కొని132 జీడిమెట్ల డివిజన్ కుత్బుల్లాపూర్ గ్రామంలోని సీనియర్ సిటిజన్స్ వెల్ఫేర్ అసోసియేషన్ ఆధ్వర్యంలో గురువారం ఎమ్మెల్యే చింతల్ కార్యాలయంలో నిర్వహించిన వయోవృద్ధుల దినోత్సవానికి బిఆర్ఎస్ ఎల్పీ విప్, ఎమ్మెల్యే కేపీ వివేకానంద్ ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ నిన్నటి తరం అందించిన విలువలే, నేటి సమాజానికి బలమైన పునాదని అన్నారు. అనంతరం సీనియర్ సిటిజన్స్ వెల్ఫేర్ అసోసియేషన్ ఆధ్వర్యంలో నిర్వహించిన వివిధ పోటీల్లో గెలుపొందిన వయోవృద్ధులకు బహుమతులతో పాటు భారత రాజ్యాంగం, చైతన్య భగవద్గీత పుస్తకాలను అందజేశారు.

ఈ కార్యక్రమంలో సీనియర్ సిటిజన్స్ వెల్ఫేర్ అసోసియేషన్ సభ్యులు నర్సింహా రెడ్డి, పెద్ది మల్లేశం, గోపాల కృష్ణ ఆర్య, నరహరి, మురళీ గౌడ్, లక్ష్మణా చారి, ఎం.నాగేష్, మాజీ కౌన్సిలర్ కిషన్ రావు, స్థానిక బిఆర్ఎస్ నాయకులు కుంట సిద్ధిరాములు, నరేందర్ రెడ్డి, జ్ఞానేశ్వర్, సమ్మయ్య నేత, ఆటో బలరాం, కాలే గణేష్, కుంట వేణు, బాల మల్లేష్, రాజు యాదవ్, మహిళా నాయకురాలు అరుణా రెడ్డి, ఇందిరా రెడ్డి, లావణ్య పాల్గొన్నారు.

# 60 గజాలలోని లక్ష్మి నగర్ ఫేస్ 2లో నూతన ట్రాన్స్ ఫార్మర్ ఏర్పాటుకు ఏఈకి వినతి



**కుత్బుల్లాపూర్ అక్టోబర్ 1 (జనం సాక్షి) :** కుత్బుల్లాపూర్ నియోజకవర్గం దుండిగల్ 59 సర్కిల్ బౌరంపేట్ 60 గజాల లక్ష్మీ నగర్ ఫేస్ టు నిరుపేదలు నివాసముండే బస్తీలో ప్రజలు విద్యుత్ సమస్యతో ఇబ్బంది ఎదుర్కొంటున్నారని, వారి సమస్య పరిష్కారం కోసం లక్ష్మీ నగర్ ఫేస్2 నూతన ట్రాన్స్ఫార్మర్ ఏర్పాటు చేయాలని కోరుతూ బిజెపి బౌరంపేట్ డివిజన్ అధ్యక్షులు ఈ పీసరి కృష్ణారెడ్డి ఆధ్వర్యంలో గురువారం ఏయి కి వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా పీసరి కృష్ణారెడ్డి మాట్లాడుతూ ఫేస్ 1 లో 4 ట్రాన్స్ ఫార్మర్లు ఏర్పాటు చేస్తున్నారని, అందులో నుంచి కనీసం ఒక ట్రాన్స్ ఫార్మర్ ఫేస్ 2 లో పెట్టాలని విజ్ఞప్తి చేశారు. 60 గజాలు ఫేస్ 2లో ప్రభుత్వం ఇచ్చిన 500 లకు పైగా ప్లాట్లు ఉన్నాయి అందులో సుమారు 150 పైగా పేదలు ఇండ్లు నిర్మించుకొని నివాసం ఉంటున్నారు. వారికి ఎలాంటి విద్యుత్ సౌకర్యం లేక చీకట్లోనే నానా అవస్థలు పడుతున్నారు కావున వెంటనే నూతన ట్రాన్స్ ఫార్మర్ ఏర్పాటు చేయాలని తెలిపారు. అలాగే అప్పటివరకు తాత్కాలికంగా జేఎన్ఎన్ యు ఆర్ఎం గృహాల కోసం ఏర్పాటు చేసిన ట్రాన్స్ ఫార్మర్ నుండి కనెక్షన్ ఇవ్వాలని విద్యుత్ అధికారులను కోరారు. అందుకు విద్యుత్ అధికారులు సానుకూలంగా స్పందించి తప్పకుండ వెంటనే పరిష్కారం చేస్తానని హామీ ఇచ్చారు.

ఈ కార్యక్రమం లో లైన్ ఇన్స్పెక్టర్ వై లక్ష్మారెడ్డి,లైన్ మెన్ శివకుమార్, బీజేపీ నాయకులు డి ప్రభాకర్ రెడ్డి, కాలనీ వాసులు కొమ్ము యాదయ్య, ఎం ప్రమీల, పర్వతాలు యాదవ్,చిత్తారి యాదవ్, శివ కుమార్ యాదవ్, కుమ్మరి మల్లేష్, తదితరులు పాల్గొన్నారు.

# తాండూర్ బైపాస్ రోడ్డు భూ నిర్వాసితులకు గుడ్ న్యూస్



**తాండూరు అక్టోబర్ 1(జనంసాక్షి) :** ఎన్నో రోజులుగా నిలిచిపోయిన తాండూరు బైపాస్ రోడ్డు పనులకు మోక్షం లభించింది. భూసేకరణ సమస్యలతో ఆగిపోయిన ఈ ప్రతిష్టాత్మక రహదారి పనులు త్వరలోనే తిరిగి ప్రారంభం కానున్నాయి. ఈ మేరకు అధికారులు భూ నిర్వాసితులకు భారీ పరిహారాన్ని ప్రకటించారు. తాండూరు బైపాస్ రోడ్డు కోసం భూములు కోల్పోయిన రైతులకు ఎకరాకు రూ. 30 లక్షల చొప్పున పరిహారం అందజేయనున్నట్లు తెలిపారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ బైపాస్ రోడ్డు నిర్మాణం తాండూరు అభివృద్ధికి ఎంతో కీలకం. భూములు ఇచ్చిన రైతులకు న్యాయం చేసేందుకు ప్రభుత్వం ఎకరాకు రూ.30 లక్షల పరిహారం నిర్ణయించింది. అర్హులైన రైతులు ఆలస్యం చేయకుండా రాబోయే 2-3 రోజుల్లోనే తమ పత్రాలతో దరఖాస్తు ప్రక్రియను పూర్తి చేసుకుని పరిహారం పొందాలని కోరారు. పరిహారం ప్రక్రియ వేగవంతం కావడంతో నిలిచిపోయిన బైపాస్ రోడ్డు పనులు త్వరలోనే పరుగులు పెట్టనున్నాయి. దీంతో తాండూరు పట్టణంలో ట్రాఫిక్ సమస్యకు శాశ్వత పరిష్కారం లభించనుందని ప్రజలు హర్షం వ్యక్తం చేస్తున్నారు.

# ఉప్పల్‌లో భద్రతా కృత్రిమ విన్యాసం



**ఉప్పల్, అక్టోబర్ 1 (జనం సాక్షి):** ఉప్పల్‌లోని జాతీయ భూభౌతిక పరిశోధనా సంస్థ ప్రాంగణంలో గురువారం భద్రతా కృత్రిమ విన్యాసాన్ని నిర్వహించారు. అత్యవసర పరిస్థితులు ఏర్పడిన సమయంలో సంస్థలోని అధికారులు, సిబ్బంది అప్రమత్తంగా వ్యవహరించడం, సమన్వయంతో వేగంగా స్పందించడం వంటి అంశాలను ఈ విన్యాసం ద్వారా పరిశీలించారు. ఈ సందర్భంగా పరిశోధనా సంస్థ ప్రాంగణంతో పాటు పరిసర ప్రాంతాలను క్షుణ్ణంగా తనిఖీ చేశారు. సంస్థలోకి వచ్చే వ్యక్తులు, వాహనాలపై నిఘా, ప్రవేశ ద్వారాల వద్ద భద్రతా చర్యలు, అనుమానాస్పద పరిస్థితులను గుర్తించే విధానం తదితర అంశాలను పరిశీలించారు. అలాగే అత్యవసర పరిస్థితుల్లో సంబంధిత అధికారులు వెంటనే స్పందించేలా ఉన్న ఏర్పాట్లను సమీక్షించారు. అత్యవసర పరిస్థితులు తలెత్తినప్పుడు ప్రజలు, సిబ్బందిని సురక్షిత ప్రాంతాలకు తరలించడం, సమాచారాన్ని సంబంధిత అధికారులకు చేరవేయడం, వివిధ విభాగాల మధ్య సమన్వయం వంటి అంశాలపై కూడా కృత్రిమ విన్యాసం ద్వారా సన్నద్ధతను పరిశీలించారు. భద్రతా చర్యల్లో ఏమైనా లోపాలు ఉన్నాయా, మరింత మెరుగైన ఏర్పాట్లు చేయాల్సిన అవసరం ఉందా అనే అంశాలను అధికారులు సమీక్షించారు. భవిష్యత్తులో ఎలాంటి అత్యవసర పరిస్థితులు ఎదురైనా వాటిని సమర్థవంతంగా ఎదుర్కొనేందుకు అధికారులు, సిబ్బంది ఎల్లప్పుడూ అప్రమత్తంగా ఉండాలని ఈ సందర్భంగా సూచించారు. భద్రతా ప్రమాణాలను నిరంతరం పర్యవేక్షిస్తూ అవసరమైన చర్యలు చేపట్టాలని నిర్ణయించారు.

## గురుకుల మహిళ కళాశాలలో ఎన్‌సీసీ క్యాడెట్లకు ర్యాంకుల ప్రదానోత్సవ వేడుకలు



**శామీర్ పేట్, అక్టోబర్ 1(జనం సాక్షి) :**

శామీర్ పేట్ కళాశాలలో ప్రతిభావంతులైన ఎన్‌సీసీ క్యాడెట్లకు ర్యాంకుల ప్రదానోత్సవ కార్యక్రమాన్ని గురువారం ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి కళాశాల వైస్ ప్రిన్సిపాల్ డా.వి. ప్రవంతి, కంప్యూటర్ సైన్స్ డీఎల్, ఎన్‌సీసీ కేర్‌టేకర్ ఆఫీసర్ శిల్పారాథోడ్, అధ్యాపక సిబ్బంది హాజరయ్యారు. ఈ సమావేశం వైస్ ప్రిన్సిపాల్ డా. వి. ప్రవంతి, ఎన్‌సీసీ కేర్‌టేకర్ ఆఫీసర్ శిల్పారాథోడ్ ప్రసంగాలతో ప్రారంభమైంది. అనంతరం క్యాడెట్లు ఎన్‌సీసీలో ర్యాంకుల ప్రాముఖ్యత, వాటి ద్వారా కలిగే బాధ్యతలు, క్రమ శిక్షణ మరియు నాయకత్వ లక్షణాల గురించి వివరించారు. అనంతరం అర్హత, ప్రతిభ మరియు నాయకత్వ లక్షణాలను ప్రదర్శించిన క్యాడెట్లకు ఎన్‌సీసీ ర్యాంకులను ప్రదానం చేశారు. ఈ సందర్భంగా ర్యాంకులు పొందిన క్యాడెట్లను వైస్ ప్రిన్సిపాల్, ఎన్‌సీసీ కేర్‌టేకర్ ఆఫీసర్, సిబ్బంది అభినందించారు. ఎన్‌సీసీ ద్వారా విద్యార్థుల్లో క్రమశిక్షణ, దేశభక్తి, నాయకత్వ నైపుణ్యాలు మరియు సేవాభావం పెంపొందుతాయని వారు పేర్కొన్నారు.

# 2బీ బార్ల ఏర్పాటుకు దరఖాస్తుల ఆహ్వానం

**జిల్లా ఎక్సైజ్ శాఖ డిప్యూటీ కమిషనర్ శ్రీనివాస్‌రెడ్డి**

చేవెళ్ల, అక్టోబర్ 01 (జనంసాక్షి) రాష్ట్రవ్యాప్తంగా 41 కొత్త 2బీ బార్ల ఏర్పాటుకు ప్రభుత్వం అవకాశం కల్పించిందని రంగారెడ్డి జిల్లా ఎక్సైజ్ శాఖ డిప్యూటీ కమిషనర్ శ్రీనివాస్ రెడ్డి తెలిపారు. ఇందులో చేవెళ్ల మున్సిపాలిటీ పరిధిలో ఒకటి, మొయినాబాద్ మున్సిపాలిటీ పరిధిలో రెండు బార్లకు అనుమతి ఇచ్చినట్లు పేర్కొన్నారు. గురువారం చేవెళ్ల ఎక్సైజ్ కార్యాలయంలో నిర్వహించిన విలేకరుల సమావేశంలో శ్రీనివాస్‌రెడ్డి మాట్లాడుతూ.. ఆసక్తి ఉన్నవారు అక్టోబర్ 12 సాయంత్రం 5 గంటలలోగా నిర్దేశిత నమూనాలో దరఖాస్తు చేసుకోవాలని సూచించారు. ఒక్కో దరఖాస్తుకు రూ.లక్ష రుసుమును డీడీ రూపంలో చెల్లించాల్సి ఉంటుందని, ఈ రుసుము తిరిగి చెల్లించబడదని తెలిపారు. బార్‌కు ఏడాదికి రూ.30 లక్షల లైసెన్స్ ఫీజు చెల్లించాల్సి ఉండగా, దీనిని మూడు వాయిదాల్లో చెల్లించే అవకాశం ఉందన్నారు. దరఖాస్తుతో పాటు మూడు పాస్‌పోర్టు సైజు ఫొటోలు, ఆధార్, పాన్ కార్డు తదితర అవసరమైన పత్రాలను జత చేయాలని సూచించారు. అర్హుల ఎంపికను అక్టోబర్ 16 ఉదయం 11 గంటలకు జిల్లా కలెక్టర్ కార్యాలయంలో లాటరీ విధానంలో నిర్వహించనున్నట్లు వెల్లడించారు. దరఖాస్తులను ఫ్యూచర్ సిటీ జిల్లా ప్రొహిబిషన్ అండ్ ఎక్సైజ్ అధికారి కార్యాలయం, రంగారెడ్డి డివిజన్ డిప్యూటీ కమిషనర్ కార్యాలయం లేదా హైదరాబాద్ నాంపల్లిలోని అబ్కారీ భవన్‌లో ఉన్న కమిషనర్ ఆఫ్ ప్రొహిబిషన్ అండ్ ఎక్సైజ్ కార్యాలయంలో సమర్పించవచ్చని తెలిపారు. నోటిఫికేషన్‌లో పేర్కొన్న నిబంధనలు, అర్హతలు, అవసరమైన పత్రాలను పూర్తిగా పరిశీలించిన అనంతరం దరఖాస్తు చేసుకోవాలని సూచించారు. ఈ సమావేశంలో చేవెళ్ల ఎక్సైజ్ సర్కిల్ ఇన్‌స్పెక్టర్ సిహెచ్. కల్పన, ఇన్‌స్పెక్టర్ డి. లలిత, ఎక్సైజ్ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

## వీధి కుక్కల నియంత్రణకు డాగ్ క్యాచింగ్ వాహనాలు

**శంషాబాద్,అక్టోబర్1(జనంసాక్షి) :** వీధి కుక్కల వల్ల ప్రజలకు ప్రమాదాలు, ఇబ్బందులు తలెత్తకుండా నియంత్రణ చర్యల్లో భాగంగా డాగ్ క్యాచింగ్ వాహనాలను అందుబాటులోకి తీసుకొచ్చినట్లు శంషాబాద్ జోనల్ కమిషనర్ కె. చంద్రకళ తెలిపారు. శంషాబాద్ జోనల్ కార్యాలయంలో గురువారం ఆమె డాగ్ క్యాచింగ్ వాహనాలను డీసీ సుమన్ రావుతో కలిసి లాంఛనంగా ప్రారంభించారు. జోన్ పరిధిలో వీధి కుక్కల సమస్యపై ప్రజల నుంచి వచ్చే ఫిర్యాదుల ఆధారంగా చర్యలు చేపట్టేందుకు ఈ వాహనాలను వినియోగించనున్నట్లు తెలిపారు. వీధి కుక్కలకు సంబంధించిన సమస్యలు, ఫిర్యాదులను 040-21111111 టోల్‌ఫ్రీ నంబర్‌కు తెలియజేయాలని ప్రజలకు సూచించారు. ఈ కార్యక్రమంలో ఎస్‌ఈ కిష్టప్ప, మున్సిపల్ అధికారుల సిబ్బంది పాల్గొన్నారు.

## ప్రగతి నగర్‌లో సీసీ రోడ్డు అభివృద్ధి పనులకు శంకుస్థాపన

**కుతుబుల్లాపూర్ అక్టోబర్ 1( జనం సాక్షి) :** కుత్బుల్లాపూర్ నియోజకవర్గ 276వ ప్రగతి నగర్ డివిజన్‌లోని జయ ఆర్కేడ్ మొదలై వింధ్య ప్రైడ్ వరకు సీఎంపీ నిధులు రూ.12 లక్షలతో చేపట్టనున్న సీసీ రోడ్డు అభివృద్ధి పనులకు గురువారం కుత్బుల్లాపూర్ నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ ఇన్‌చార్జి కొలన్ హన్మంత్ రెడ్డి శంకుస్థాపన చేసి పనులను ప్రారంభించారు. ఈ సందర్భంగా కొలన్ హన్మంత్ రెడ్డి మాట్లాడుతూ, ప్రజలకు మెరుగైన మౌలిక సదుపాయాలు కల్పించడమే లక్ష్యంగా కాంగ్రెస్ పార్టీ కృషి చేస్తోందని, ప్రజల అవసరాలకు అనుగుణంగా అభివృద్ధి పనులకు ప్రాధాన్యతనిస్తూ, నియోజకవర్గ అభివృద్ధికి నిరంతరం కృషి చేస్తామని తెలిపారు. బొమ్ము వెంకటేశ్వర్ రెడ్డి అధ్యక్షతన నిర్వహించిన ఈ శంకుస్థాపన కార్యక్రమంలో సీనియర్ కాంగ్రెస్ నాయకులు, మహిళా నాయకులు, స్థానిక కాంగ్రెస్ నాయకులు, పార్టీ కార్యకర్తలు కాలనీ ప్రజలు పాల్గొన్నారు.

## మున్సిపల్ అధికారుల నిర్లక్ష్యానికి నిదర్శనం

**23వ వార్డులో పార పట్టుకున్న కౌన్సిలర్ కిరణ్**

**తాండూరు అక్టోబర్ 1(జనంసాక్షి) :** మున్సిపల్ అధికారుల నిర్లక్ష్యానికి 23వ వార్డు నిదర్శనంగా మారింది. మురుగు కాలువలు శుభ్రం చేయాలని ఎన్నిసార్లు ఫిర్యాదు చేసినా సిబ్బంది పట్టించుకోకపోవడంతో సహనం నశించిన కౌన్సిలర్ కిరణ్ తానే స్వయంగా పార పట్టుకుని కాలువలను శుభ్రం చేశారు. ఈ సందర్భంగా కౌన్సిలర్ కిరణ్ మాట్లాడుతూ 23వ వార్డులో పారిశుద్ధ్య పరిస్థితి అత్యంత దారుణంగా ఉంది. మురుగు కాలువల్లో చెత్త పేరుకుపోయి దుర్గంధం వెదజల్లుతోంది. దోమల బెడదతో ప్రజలు అనారోగ్యాల పాలవుతున్నారు. అధికారులకు, సిబ్బందికి ఎన్నిసార్లు చెప్పినా మురుగు కాలువలు శుభ్రం చేయడం లేదు. మొత్తం వార్డుకు పారిశుద్ధ్యానికి ఒక్క కార్మికుడు మాత్రమే ఉన్నాడు. సమస్యలు మాత్రం ఎన్నో ఉన్నాయి. అధికారుల నిర్లక్ష్యం వల్లనే ప్రజలు ఇబ్బందులు పడుతున్నారు. ఇప్పటికైనా మున్సిపల్ కమిషనర్ స్పందించి తగిన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. వార్డులో పారిశుద్ధ్య కార్మికుల కొరతను తీర్చి, వెంటనే మురుగు కాలువలను శుభ్రం చేయాలని వార్డు ప్రజలు కూడా కోరుతున్నారు.

## 3.38 కోట్ల మందిపై ఇండస్ టవర్స్ సీఎస్ఆర్ ప్రభావం

**ఖైరతాబాద్, అక్టోబర్ 01 (జనం సాక్షి) :** ఇండస్ టవర్స్ లిమిటెడ్ చేపట్టిన 'సక్షమ్' 'ప్రగతి' సీఎస్ఆర్ కార్యక్రమాల ద్వారా ఆర్థిక సంవత్సరం–26లో దేశ వ్యాప్తంగా 3.388 కోట్ల మంది జీవితాలపై సానుకూల ప్రభావం చూపినట్లు ఇండస్ టవర్స్ ఎండీ, సీఈఓ ప్రచూర్ సాహ్ గురువారం నగరంలో విడుదల చేసిన ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ఆయన మాట్లాడుతూ మొత్తంగా ఇప్పటివరకు 9 కోట్ల మందికి సీఎస్ఆర్ కార్యక్రమాలను విస్తరించినట్లు పేర్కొన్నారు. డిజిటల్ సమ్మిళితం, విద్య, ఆరోగ్యం, జీవనోపాధి, మహిళా సాధికారత తదితర రంగాల్లో కార్యక్రమాలు అమలు చేస్తున్నట్లు తెలిపారు. 2030 నాటికి 15 కోట్ల మంది జీవితాలపై ప్రభావం చూపడం లక్ష్యంగా పెట్టుకున్నట్లు పేర్కొన్నారు. సమ్మిళిత అభివృద్ధి, సామాజిక సాధికారతకు తమ సీఎస్ఆర్ కార్యక్రమాలు దోహదపడుతున్నాయని తెలిపారు.

## ప్రజాసేవకు ప్రత్యేక గుర్తింపు

- **అబ్దుల్ కలాం ఫౌండేషన్ ఫౌండర్, చైర్మన్ శివశంకర్ కు ఢిల్లీలో యూనివర్సల్ హానరరీ అవార్డు**



**ముషీరాబాద్, అక్టోబర్ 01 (జనం సాక్షి):** సామాజిక సేవ, పర్యావరణ పరిరక్షణ, వంటి సేవ యువత, విద్యార్థులు, రైతులు, మహిళలు, సామాజిక చైతన్యం దిశగా సాగిస్తున్న నిరంతర కృషికి గాను ఢిల్లీలోని యూనివర్సల్ హానరరీ అవార్డు ను అబ్దుల్ కలాం ఫౌండేషన్ ఫౌండర్ చైర్మన్ శివశంకర్ కు కౌన్సిల్ ఆధ్వర్యంలో గౌరవ డాక్టరేట్ అందజేశారు. గత కొన్నేళ్లుగా ఆయన సామాజిక సేవా కార్యక్రమాలను విస్తృత స్థాయిలో కొనసాగిస్తూ, విద్యా రంగం, యువత ప్రోత్సాహం, పర్యావరణ పరిరక్షణ, మహిళా సాధికారత, రైతు సంక్షేమం, ఆరోగ్య అవగాహన, మాదక ద్రవ్యాల వ్యతిరేక ప్రచారం వంటి పలు సామాజిక కార్యక్రమాల్లో చురుకుగా పాల్గొంటున్నారు. ఆయన సేవలను గుర్తించి యూనివర్సల్ హానరరీ అవార్డు కౌన్సిల్ ఈ గౌరవ డాక్టరేట్‌ను ప్రదానం చేసింది. ఈ సందర్భంగా శివశంకర్ మాట్లాడు తూ... ఈ పురస్కారం తనపై ఉంచిన బాధ్యతను మరింత పెంచిందని, సమాజ సేవలో ఇంకా ఎక్కువగా పనిచేయాలని సంకల్పంగా ఉన్నానని తెలిపారు. ఈ అవార్డు తనకోసమే కాదని, తమ ఫౌండేషన్‌తో కలిసి పనిచేస్తున్న సేవా కార్యకర్తలందరికీ సొంతమని ఆయన అన్నారు. తన సేవా కార్యక్రమాలను గుర్తించి ఢిల్లీలో గౌరవ డాక్టరేట్ అందించడం పట్ల ఆయన కృతజ్ఞతలు తెలిపారు. పేద విద్యార్థులకు అండగా నిలిచేందుకు ఎల్లవేళలా అందుబాటులో ఉంటామని తెలిపారు.

# పిల్లల ఆన్‌లైన్ భద్రతకు మరింత పటిష్ట చర్యలు అవసరం

**సుప్రీంకోర్టు తాజా చర్యను స్వాగతించిన స్కోప్**



**హయత్ నగర్, అక్టోబర్ 1 (జనం సాక్షి) :**

పిల్లల ఆన్‌లైన్ భద్రతను మరింత బలోపేతం చేసేందుకు డిజిటల్ వేదికలపై కఠినమైన రక్షణ చర్యలు అవసరమని స్పందన కల్చరల్ ఆర్గనైజేషన్ ఫర్ ప్రోగ్రెసివ్ ఎడ్యుకేషన్ (స్కోప్) పేర్కొంది. మైనర్లకు సంబంధించిన భారతీయ చట్టాలను సామాజిక మాధ్యమాలు, ఇతర డిజిటల్ వేదికలు తప్పనిసరిగా పాటించేలా చట్టబద్ధమైన రక్షణ వ్యవస్థను ఏర్పాటు చేసే అవకాశాన్ని పరిశీలించాలని కేంద్ర ప్రభుత్వాన్ని సుప్రీంకోర్టు కోరడాన్ని స్కోప్ స్వాగతించింది. 18 సంవత్సరాల లోపు మైనర్లు డిజిటల్ వేదికలతో స్వతంత్రంగా ఒప్పందాలు చేసుకునే అంశానికి సంబంధించిన చట్టపరమైన పరిస్థితులను కూడా పరిశీలించాలని సుప్రీంకోర్టు సూచించిన నేపథ్యంలో ఈ అంశానికి ప్రాధాన్యం ఏర్పడిందని స్కోప్ తెలిపింది.

తెలంగాణలోని జనగామ, సంగారెడ్డి, యాదాద్రి భువనగిరి జిల్లాల్లో బాలల రక్షణ కోసం క్షేత్రస్థాయిలో పనిచేస్తున్న స్కోప్ సంస్థ, పిల్లలు సామాజిక మాధ్యమాలు, ఇతర డిజిటల్ వేదికలను విస్తృతంగా వినియోగిస్తున్న నేపథ్యంలో ఆన్‌లైన్ లైంగిక దోపిడీ, గ్రూమింగ్, సైబర్ వేధింపులు, సెక్స్టార్షన్, బాలల అక్రమ రవాణా వంటి ప్రమాదాలపై అప్రమత్తత అవసరమని పేర్కొంది.

స్కోప్ అధ్యక్షులు డా. బండి సాయన్న మాట్లాడుతూ, "పిల్లలు ఆన్‌లైన్‌లో ఎక్కువ సమయం గడుపుతున్నప్పటికీ అక్కడ దాగి ఉన్న ప్రమాదాలను పూర్తిగా అర్థం చేసుకునే వయస్సు, అవగాహన వారికి ఎల్లప్పుడూ ఉండకపోవచ్చు. గ్రూమింగ్, లైంగిక వేధింపులు, మోసం, మానిప్యులేషన్ వంటి ప్రమాదాల నుంచి పిల్లలను రక్షించేందుకు డిజిటల్ వేదికలపై మరింత పటిష్టమైన రక్షణ చర్యలు, జవాబుదారీతనం అవసరం" అని అన్నారు.

మైనర్లు డిజిటల్ వేదికలపై స్వతంత్రంగా ఖాతాలను సృష్టించడం, నిర్వహించడం, ఒప్పందాలు చేసుకునే చట్టబద్ధ సామర్థ్యానికి సంబంధించిన అంశాలపై జస్ట్ రైట్స్ ఫర్ చిల్డ్రన్ అలయన్స్ (జేఆర్‌సీ అలయన్స్) దాఖలు చేసిన పిటిషన్‌ను సుప్రీంకోర్టు పరిశీలించింది. ఈ అంశంపై కేంద్ర ప్రభుత్వం కూడా పరిశీలన చేపడతామని కోర్టుకు తెలిపింది.

ప్రతిపాదిత చట్టబద్ధ వ్యవస్థ అమల్లోకి వస్తే డిజిటల్ వేదికల జవాబుదారీతనం పెరగడంతో పాటు, భారతీయ చట్టాల ప్రకారం పిల్లల హక్కులు, భద్రతకు మరింత రక్షణ లభించే అవకాశం ఉంటుందని స్కోప్ పేర్కొంది. పిల్లల్లో డిజిటల్ అవగాహన పెంపొందించడం, ఆన్‌లైన్ దోపిడీని నివారించడం, సురక్షితమైన వాతావరణాన్ని కల్పించడం కోసం ప్రభుత్వ అధికారులు, బాలల రక్షణ సంస్థలు, పౌర సమాజ సంస్థలు, తల్లిదండ్రులు, ఉపాధ్యాయులు, స్థానిక సమాజాలతో కలిసి పనిచేయడానికి స్కోప్ తన నిబద్ధతను పునరుద్ఘాటించింది.

## గాంధీ జయంతి సందర్భంగా పట్టణంలో మటన్ షాపులు, మద్యం దుకాణాలు బంద్

### మున్సిపల్ శాఖ ముందస్తు నోటీసులు



**తాండూరు అక్టోబర్ 1(జనంసాక్షి) :** అక్టోబర్ 2 గాంధీ జయంతి సందర్భంగా తాండూరు పట్టణంలో మాంసం, మటన్ దుకాణాలు, మద్యం షాపులను మూసివేయాలని మున్సిపల్ శాఖ ముందస్తు నోటీసులు జారీ చేసింది. ఈ మేరకు మున్సిపల్ అధికారులు మాట్లాడుతూ... "జాతిపిత మహాత్మా గాంధీ జయంతిని పురస్కరించుకుని ప్రతి ఏటా డ్రై డే గా పాటిస్తారు. అందులో భాగంగా గాంధీ జయంతి రోజున పట్టణ పరిధిలోని మటన్, చికెన్, మాంసం దుకాణాలు, కబేళాలు, మద్యం దుకాణాలు, బార్ అండ్ రెస్టారెంట్లు పూర్తిగా మూసివేయాలి" అని ఆదేశించారు. నిబంధనలు ఉల్లంఘించి దుకాణాలు తెరిచిన వారిపై కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. వ్యాపారులు, ప్రజలు సహకరించి గాంధీ జయంతి వేడుకలను శాంతియుతంగా జరుపుకోవాలని మున్సిపల్ శాఖ కోరింది.

## నిమ్స్‌ను సందర్శించిన ఎస్సీ, ఎస్టీ కమిషన్ చైర్మన్



**ఖైరతాబాద్, అక్టోబర్ 1, (జనం సాక్షి) :** నగరంలోని నిజామ్స్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ మెడికల్ సైన్సెస్ (నిమ్స్)ను రాష్ట్ర ఎస్సీ, ఎస్టీ సంక్షేమ సం ఘం కమిషన్ చైర్మన్ బక్కి వెంకటయ్య గురువారం సందర్శించారు. నిమ్స్‌లో ఎస్సీ, ఎస్టీ ఉద్యోగులకు సంబంధించిన సమస్యల పరిష్కారంపై ఆయన రివ్యూ సమావేశం నిర్వహించారు. గతంలో నిమ్స్ సందర్శన సందర్భంగా ఎస్సీ, ఎస్టీ ఉద్యోగులకు సంబంధించిన బ్యాక్‌లాగ్ పోస్టుల భర్తీ, పదోన్న తుల్లో ఎదురవుతున్న సమస్యలు, ఉద్యోగులకు జరుగుతున్న అన్యాయాలు తదితర అంశాలపై చర్చించిన విషయం తెలిసిందే. ఆయా సమస్యల్లో ఇప్పటివరకు ఎంతవరకు పరిష్కారం లభించింది. ఇంకా ఏ అంశాలు పెండింగ్‌లో ఉన్నాయి. అనే విషయాలను తెలుసుకునేందుకు బక్కి వెంకట య్య తాజా పర్యటన చేపట్టారు.

**అంబేద్కర్ చిత్రపటానికి నివాళులు**

ఈ సందర్భంగా నిమ్స్ డైరెక్టర్ ప్రొ. రాహుల్ దేవరాజ్తో కలిసి నిమ్స్ పాత భవనంలోని ఐపీ బిల్లింగ్ కౌంటర్ వద్ద ఉన్న డాక్టర్ బి.ఆర్. అంబేద్కర్ చిత్రపటానికి బక్కి వెంకటయ్య పూలమాల వేసి నివాళులర్పించారు. అనంతరం నిమ్స్ పాత భవనం మొదటి అంతస్తులోని లెర్నింగ్ సెంటర్‌లో రివ్యూ సమావేశం నిర్వహించారు. నిమ్స్ డైరెక్టర్ ప్రొ. రాహుల్ దేవరాజ్, డీన్ ప్రొ. చంద్రశేఖర్, ఎగ్జిక్యూటివ్ రిజిస్ట్రార్ పరంజ్యోతితో కలిసి ఎస్సీ, ఎస్టీ ఉద్యోగులకు సంబంధించిన వివిధ అంశాలపై చర్చించారు. గతంలో గుర్తించిన సమస్యల పరిష్కారంపై వివరాలను తెలుసుకుని, ఇంకా పెండింగ్‌లో ఉన్న అంశాలపై సమీక్షించారు. ఈ కార్యక్రమంలో ఎస్సీ, ఎస్టీ సంక్షేమ సంఘం కమిషన్ సభ్యులు కుస్రం నీలాదేవి, రాంబాబు నాయక్, కొంకటి లక్ష్మీనారాయణ, జిల్ల శంకర్, రేణుకుంట్ల ప్రవీణ్, నిమ్స్ మెడికల్ సూపరింటె డెంట్ డా. నిమ్మ సత్యనారాయణ, అసిస్టెంట్ మెడికల్ సూపరింటెండెంట్లు డా. రాకేష్, డా. చరణ్, నిమ్స్ ఎస్సీ, ఎస్టీ ఎంప్లాయీస్ లైజన్ ఆఫీసర్ రవికుమార్, ఎస్సీ, ఎస్టీ ఎంప్లాయీస్ వెల్ఫేర్ అసోసియేషన్ అధ్యక్షులు, కార్యదర్శులు కేజియా రాణి, సేవాలాల్, శేఖర్, విద్యాసాగర్, వెంకట్ రత్నం, నిర్మలతో పాటు సంఘం సభ్యులు, నిమ్స్ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

## పందులు పరార్.. మేకల బేజార్

### ప్రభుత్వ నిధులతో నాటిన మొక్కలు మేకల పాలు
### యజమానుల నిర్లక్ష్యంపై గ్రామస్థుల ఆగ్రహం.. చర్యలు కరువు

**కొందుర్గు జనంసాక్షి :** గ్రామంలో ఎట్టకేలకు పందుల బెడద తప్పిందని సంతోషించే లోపే.. మేకల రూపంలో కొత్త సమస్య వచ్చి పడిందని గ్రామస్థులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.కొందుర్గు గ్రామాన్ని పచ్చదనంతో నింపేందుకు, పర్యావరణాన్ని రక్షించేందుకు ప్రభుత్వం లక్షలాది రూపాయల నిధులను వెచ్చించి నాటుతున్న మొక్కలు మేకల పాలవుతున్నాయి. కొంతమంది మేకల యజమానులు తమ పశువులను గాలికి వదిలేస్తుండటంతో, అవి గ్రామ పంచాయతీ నాటిన మొక్కలను ఇష్టారాజ్యంగా నమిలేస్తూ





నాశనం చేస్తున్నాయి. గ్రామ పంచాయతీ సిబ్బంది ఎంతో కష్టపడి, ఎండనక వాననక నాటిన ప్రతి మొక్కను రక్షించాల్సిన బాధ్యత అందరిపైనా ఉంది. కానీ, మేకల యజమానులకు కనీస పట్టింపు లేకపోవడంపై సర్వత్రా విమర్శలు వ్యక్తమవుతున్నాయి. ఉదయాన్నే మేకలను రోడ్లపైకి, కాలనీల్లోకి వదిలేస్తూ వాటి సంరక్షణను గాలికి వదిలేస్తున్నారు. దీనివల్ల పచ్చగా ఎదుగుతున్న మొక్కలన్నీ మొండివారిపోతున్నాయి. ప్రభుత్వ సొమ్మును, పంచాయతీ శ్రమను ఇలా వృథా చేయడంపై స్థానికులు తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు.

## పోక్సో కేసులో నిందితుడికి కఠిన కారాగార శిక్ష

### మేడ్చల్ ఫాస్ట్ ట్రాక్ పోక్సో కోర్టు తీర్పు



**జవహర్ నగర్ అక్టోబర్ 1 (జనంసాక్షి ):** పోక్సో కేసులో నిందితుడికి కఠిన కారాగార శిక్ష పడ్డ సంఘటన జవహర్ నగర్ పోలీస్ స్టేషన్ పరిధిలో చోటుచేసుకుంది. ఎస్ హెచ్ ఓ సైదులు తెలిపిన కథనం ప్రకారం జవహర్ నగర్ పోలీస్ స్టేషన్ పరిధిలో జోరిల్ల వెంకటయ్య (55) స్థానిక జ్యోతి (బాలాజీ నగర్) కాలనీలో నివసిస్తున్నారు. అతనిపై జవహర్ నగర్ పోలీస్ స్టేషన్లో ఐపిసి సెక్షన్ 354 పోక్సో చట్టం 2012 సెక్షన్ 12 మేడ్చల్ జిల్లాలోని అత్యాచారం విచారణ పరిష్కార కోసం నిందితుడికి ఐదు సంవత్సరాల కఠిన కారాగార శిక్ష, రూ .3 వేల రూపాయల జరిమానా విధించారు. బాధితురాలికి 50 వేల రూపాయల పరిహారం చెల్లించాలని తీర్పు వెల్లడించింది. ఈ సందర్భంగా ఎస్హెచ్ఓ సైదులు మాట్లాడుతూ త్వరగా తీర్పు రావడం శుభ పరిణామం అన్నారు. చట్టం తమ పని తాము చేసుకుపోతుందన్నారు. ప్రజలు చట్టాలను గౌరవించాలని, శాంతి భద్రతలు అసాంఘిక కార్యకలాపాల పట్ల అప్రమత్తంగా ఉండాలని తెలిపారు.

## బంట్వారం మండలంలో స్మార్ట్ రేషన్ కార్డులు, సన్నబియ్యం అందిస్తున్న ప్రభుత్వం'

**బంట్వారం అక్టోబర్ 01జనం సాక్షి :** ప్రభుత్వం ప్రతీ నిరుపేద లకు స్మార్ట్ రేషన్ కార్డులు పంపి ణీ చేస్తూ సన్న బియ్యం అందిస్తుందని కాంగ్రెస్ మండలాధ్య క్షులు బక్కా పురు షోత్తం రెడ్డి అన్నారు. మండల పరిధిలోని రొంపల్లిలో ఆయన ఆధ్వ ర్యంలో అర్హులకు మంజూరైన స్మార్ట్ రేషన్ కార్డులు పంపిణీ చేసి ఆయన మాట్లాడుతూ..బీఆర్ఎస్ పాలనలో ఏ ఒక్కరికీ రేషన్ కార్డు పంపిణీ చేయలేదని కాంగ్రెస్ ప్రభుత్వం ఏర్పడిన వెంటనే రేషన్ కార్డులు పంపిణీ చేస్తూ సన్నబియ్యం పంపిణీ చేస్తుందన్నారు. మాజీ సర్పంచ్ రాధాకృష్ణ గౌడ్ మాట్లాడుతూ...ప్రతీ నిరుపేదలకు స్మార్ట్ రేషన్ కార్డులు పంపిణీ చేస్తూ సన్న బియ్యంతో కడుపునింపుతున్న ఏకైక ప్రభుత్వం కాంగ్రెస్ అన్నారు. కార్యక్రమంలో రొంపల్లి మాజీ సర్పంచ్ రాధాకృష్ణ, రొంపల్లి గ్రామ కాంగ్రెస్ నాయకులు సంగమేష్, వెంకటేశం, మాజీ అధ్యక్షులు వెంకటేశం, రేషన్ కార్డ్ లబ్దిదారులు పాల్గొన్నారు.

## డిప్లమా డిగ్రీ కోర్సు పూర్తి చేసిన వారు పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికల్లో ఓటు వేయడానికి 18వ ఫారం నింపి ఆన్లైన్లో దరఖాస్తు చేసుకోవాలి

### నవాబుపేట్ తహసీల్దార్ బుచ్చయ్య



**నవాబు పేట్ (జనంసాక్షి):**డిప్లమా డిగ్రీ పూర్తి చేసుకున్న వారు పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికలకు ఓటుకు అర్హులు కావడంతో అక్టోబర్ 31 వరకు 18 ఫారం నింపి ఆన్లైన్లో దరఖాస్తు చేసుకోవాలని నవాబుపేట్ మండల తాసిల్దార్ బుచ్చయ్య గురువారం తెలిపారు. ఆయన మాట్లాడుతూ 31-10-2023 వరకు డిగ్రీ, డిప్లమా లేదా డిగ్రీ తో సమానమైన కోర్సును పూర్తిచేసిన వారు పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికలలో ఓటు వేయడానికి ఫారం 18 నింపి ఆన్లైన్/ ఆఫ్లైన్ దరఖాస్తులు చేసుకోవాలని నవాబుపేట తహసీల్దార్ జె వాళ్ళ బుచ్చయ్య అన్నారు. ఆయన అభ్యర్థులతో మాట్లాడుతూ గతంలో ఓటు వేశామని ప్రస్తుతం అవసరం లేదు లే అని నిర్లక్ష్యం వహించరాదని సూచించారు. గతంలో ఓటేసిన వారు కూడా ప్రస్తుతం ఆన్లైన్ / ఆఫ్ లైన్ దరఖాస్తు చేసుకోవాలన్నారు. ఇంకా ఏమైనా అభ్యంతరాలు ఉంటే మా సిబ్బంది ద్వారా నివృత్తి చేసుకొని ఓటరుగా నమోదు కావాలని సూచించారు. ఈ అవకాశాన్ని పట్టభద్రులైన ప్రతి ఒక్కరు వినియోగించుకోవాలన్నారు. ఓటరుగా నమోదు చేసుకోవడానికి డిగ్రీ ఉన్న ప్రతి ఒకరు అప్లై చేసుకోవాలని గుర్తు చేశారు.

## 4న ఉమ్మడి రంగారెడ్డి జిల్లా జూనియర్ ఖో-ఖో జట్ల ఎంపికలు : తోట జయప్రకాష్

**శామీర్ పేట, అక్టోబర్01(జనం సాక్షి ) :** ఉమ్మడి రంగారెడ్డి జిల్లా జూనియర్ ఖో-ఖో (బాలబాలికల) జట్ల ఎంపికలను ఈనెల 4న నిర్వహించనున్నట్లు రంగారెడ్డి ఖో-ఖో అసోసి యేషన్ ప్రధాన కార్యదర్శి తోట జయప్రకాష్ తెలిపారు. తెలంగాణ ఖో-ఖో అసోసియేషన్ ఆధ్వర్యంలో జరగనున్న 45వ రాష్ట్రస్థాయి జూనియర్ ఖో-ఖో ఛాంపియన్‌షిప్ 2026-27 పోటీల్లో పాల్గొనే జిల్లా జట్ల ఎంపిక కోసం ఈ ప్రక్రియ చేపడుతున్నట్లు ఆయన పేర్కొన్నారు.ఈ ఎంపికలకు 18 సంవత్సరాల లోపు వయస్సు ఉన్న బాలబాలికలు వయస్సుంబరువువంఎత్తు 250 కి ఉంచకుండా ఉన్నవారు అర్హులని, జనవరి 1, 2009 తర్వాత జన్మించి డిసెంబర్ 31, 2026 నాటికి 18 ఏళ్ల పూర్తికాని క్రీడాకారులు మాత్రమే హాజరుకావాలని జయప్రకాష్ స్పష్టం చేశారు. ఆసక్తి ఉన్న క్రీడాకారులు తమ ఒరిజినల్ ఆధార్ కార్డుతో ఈనెల 4వ తేదీ ఉదయం 9 గంటలకు హాజరు కావాలని ఆయన సూచించారు. ఎంపికల్లో ప్రతిభ చూపిన క్రీడాకారులను జిల్లా జట్లకు ఎంపిక చేసి రాష్ట్రస్థాయి పోటీలకు పంపనున్నట్లు వెల్లడించారు. అర్హులైన ప్రతిభావంతులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరిన ఆయన, ఇతర వివరాల కోసం జిల్లా ఖో-ఖో అసోసియేషన్ అధ్యక్షురాలు మంజుల (9848288170), లావణ్య (9550138106) నంబర్లలో సంప్రదించవచ్చని తెలిపారు.

# జర్నలిస్టుల సత్తా చాటుదాం.. డిమాండ్ల కోసం గళమెత్తుదాం!

### అక్టోబర్ 2న ఈసీఐఎల్ నుంచి కాప్రా వరకు భారీ శాంతియుత ర్యాలీ

### జర్నలిస్టులు పెద్దసంఖ్యలో తరలిరావాలి: వడ్డేమాను సుందర్



**హైదరాబాద్-జనంసాక్షి :** వర్కింగ్ జర్నలిస్టుల నేషనల్ డిమాండ్స్ డేను పురస్కరించుకుని జర్నలిస్టుల హక్కులు, సమస్యల పరిష్కారం కోసం ఐక్యంగా ఉద్యమిద్దామని మేడిపల్లి మండల ప్రెస్ క్లబ్ ప్రధాన కార్యదర్శి వడ్డేమాను సుందర్ పిలుపునిచ్చారు. అక్టోబర్ 2న టీయూడబ్ల్యూజే ఆధ్వర్యంలో నిర్వహించనున్న శాంతియుత ర్యాలీని విజయవంతం చేయాలని కోరారు. శుక్రవారం ఉదయం 10 గంటలకు ఈసీఐఎల్ చౌరస్తా నుంచి కాప్రా మున్సిపల్ కార్యాలయం వరకు శాంతియుత ర్యాలీ నిర్వహించనున్నట్లు తెలిపారు. అనంతరం గాంధీ విగ్రహానికి వినతిపత్రం అందజేయనున్నట్లు పేర్కొన్నారు. జర్నలిస్టులు పెద్ద సంఖ్యలో పాల్గొని తమ ఐక్యతను చాటాలని కోరారు.

# చీర్యాలలో లాసా కేఫ్ ప్రారంభం

### రిబ్బన్ కట్ చేసి ప్రారంభించిన లక్ష్మీనారాయణ



**కీసర, అక్టోబర్ 01 (జనంసాక్షి) :** నాణ్యమైన ఆహార పదార్థాలను అందిస్తూ వినియోగదారుల ఆదరణ పొందాలని శ్రీ చీర్యాల లక్ష్మీనరసింహస్వామి దేవస్థానం ఫౌండర్ అండ్ చైర్మన్ మల్లారపు లక్ష్మీనారాయణ ఆకాంక్షించారు. ఎంఎంసి కార్పొరేషన్ కీసర సర్కిల్ కీసర డివిజన్ పరిధి లోని చీర్యాల గ్రామంలో నూతనంగా ఏర్పాటు చేసిన లాసా కేఫ్ను శ్రీ చీర్యాల లక్ష్మీనరసింహస్వామి దేవస్థానం ఫౌండర్ అండ్ చైర్మన్ మల్లారపు లక్ష్మీనారాయణ గురువారం రిబ్బన్ కట్ చేసి ప్రారంభించారు. ఈ సందర్భంగా కేఫ్ నిర్వాహకులకు శుభాకాంక్షలు తెలిపారు. ఆయన మాట్లాడుతూ.. పరిశుభ్రత, నాణ్యతకు ప్రాధాన్యం ఇస్తూ వ్యాపారాన్ని అభివృద్ధి చేసుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో కేఫ్ నిర్వాహకులు, స్థానికులు తదితరులు పాల్గొన్నారు.

# పిఎసిఎస్ చైర్మన్ పి. జనార్ధన్ రెడ్డికి బిఎస్ఆర్ అభినందనలు



**తాండూరు ఆక్టోబర్ 1(జనంసాక్షి) :** తాండూర్ మండలం యెల్మకన్నె పిఎసిఎస్ నూతన చైర్మన్‌గా ఎన్నికైన పి. జనార్ధన్ రెడ్డితో పాటు నూతనంగా ఎన్నికైన డైరెక్టర్లను ఆర్బిఓఎల్ సీఈఓ, సీనియర్ కాంగ్రెస్ నాయకులు బుయ్యని శ్రీనివాస్ రెడ్డి అభినందించారు.ఈ సందర్భంగా చైర్మన్ పి. జనార్ధన్ రెడ్డి, డైరెక్టర్లకు శుభాకాంక్షలు తెలియజేస్తూ, ఫిఎసిఎస్ ద్వారా రైతులకు మరింత మెరుగైన సేవలు అందిస్తూ, వారి సంక్షేమం కోసం సమిష్టిగా కృషి చేయాలని శ్రీనివాస్ రెడ్డి ఆకాంక్షించారు.ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

# ఏలూరి శ్రీనివాసరావు జన్మదిన వేడుకలు.. శుభాకాంక్షలు వెల్లువ



**మేడ్చల్ జిల్లా ప్రతినిధి, అక్టోబర్ 01 (జనంసాక్షి)**

టీజీవోస్ అసోసియేషన్ రాష్ట్ర అధ్యక్షుడు, టీజీఈజేఏసీ సెక్రటరి జనరల్ ఏలూరి శ్రీనివాసరావు జన్మదిన వేడుకలను టీజీవో ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లా శాఖ అధ్యక్షుడు ఎం.బి.కృష్ణయాదవ్, కార్యదర్శి ఎం.ఐ. ఖాదర్ తదితరులు ఏలూరి శ్రీనివాసరావుకు జన్మదిన శుభాకాంక్షలు తెలిపారు. ఉద్యోగుల సంక్షేమమే ధ్యేయంగా నిరంతరం పనిచేస్తూ, ఉద్యోగుల సమస్యల పరిష్కారానికి అండగా నిలుస్తున్న శ్రీనివాసరావు సేవలను వారు కొనియాడారు. ఆయన నాయకత్వంలో పనిచేయడం గర్వకారణమని పేర్కొన్నారు. శ్రీనివాసరావు ఆయురారోగ్యాలతో, సంతోషంగా జీవిస్తూ మరిన్ని ఉన్నత శిఖరాలను అధిరోహించాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో టీజీవో మాజీ జనరల్ సెక్రటరీ ఏ.సత్యనారాయణ పటేల్, కేంద్ర సంఘ నాయకులు సహదేవ్, డాక్టర్ వెంకటేశ్వర్లు, డాక్టర్ రామారావు, బి.వినోద్‌కుమార్, వెంకటయ్య, శ్రీరామ్, శ్రీనిలక్ష్మణ్‌గౌడ్, విజయ్, వెంకటరమణ, షోకత్ హుస్సేన్, జిల్లా రెడ్డి, శిరీషారెడ్డి తదితరులు పాల్గొన్నారు.




## పసుపు బోర్డు జాతీయ చైర్మన్ పల్లెగంగాధర్ రెడ్డిని కలిసిన దేవరంపల్లి సర్పంచ్ అశోక్



**మోమిన్ పేట అక్టోబర్ 01 ( జనంసాక్షి) :** వికారాబాద్ జిల్లా మోమిన్ పేట మండలంలోని దేవరంపల్లి గ్రామం లోని పసుపు రైతుల కోసం పసుపు బాయిలర్ పసుపు బోర్డు తరఫున కేటాయించడం సంతోషించ దగ్గ విషయమని దేవరంపల్లి గ్రామ సర్పంచ్ ఏ అశోక్ ఆధ్వర్యంలో పలువురు రైతులు నిజామాబాద్ లోని పసుపు బోర్డు కార్యాలయంలో జాతీయ పశువు బోర్డు చైర్మన్ పల్లె గంగాధర్ రెడ్డి ని గురువారం కలిసి ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు ఈ సందర్భంగా పసుపు రైతుల కోసం ప్రభుత్వం అనేక సంక్షేమ పథకాలు అమలు చేస్తున్నందున వాటిని పకడ్బందీగా అమలుపెట్టాలని జాతీయ చైర్మన్ ను వారు కోరినట్లు తెలిసింది పసుపు రైతులు ఎదుర్కొంటున్న ఇబ్బందులను గ్రహించి వారికి అవసరం ఉన్న పరికరాలు వెంటనే మంజూరు చేయాలని వారు కోరారు ఈ సందర్భంగా పసుపు బోర్డు జాతీయ చైర్మన్ పల్లెదంగాధర్ రెడ్డి సానుకూలంగా స్పందించినట్లు వారు వివరించారు

# విద్యార్థులు లక్ష్యంతో చదివి గమ్యాన్ని చేరుకోవాలి

### తలకొండపల్లిలో ఘనంగా జూనియర్ కళాశాల స్టూడెంట్స్ ఫ్రెషర్స్ డే వేడుకలు

### ముఖ్యఅతిథిగా పాల్గొన్న ఎమ్మెల్యే కసిరెడ్డి నారాయణరెడ్డి



**తలకొండపల్లి అక్టోబర్ 01 (జనంసాక్షి):** విద్యార్థులు లక్ష్యాన్ని ఎంచుకొని దాన్ని సాధించేందుకు క్రమశిక్షణతో చదివి గమ్యాన్ని చేరుకోవాలని కల్వకుర్తి ఎమ్మెల్యే కసిరెడ్డి నారాయణరెడ్డి పేర్కొన్నారు.తలకొండపల్లి మండల కేంద్రంలోని దేవకీ ఫంక్షన్ హాల్ లో ప్రభుత్వ జూనియర్ కళాశాల ప్రిన్సిపాల్ చరణ్ చారి ఆధ్వర్యంలో గురువారం ఫ్రెషర్స్ డే వేడుకలను ఘనంగా నిర్వహించారు.ఈ కార్యక్రమానికి కల్వకుర్తి ఎమ్మెల్యే కసిరెడ్డి నారాయణరెడ్డి ముఖ్య అతిథిగా హాజరైనారు.ముందుగా స్థానిక కాంగ్రెస్,బీఆర్ఎస్ నాయకులు,కళాశాల అధ్యాపకులు,విద్యార్థులతో కలిసి సరస్వతీ దేవి చిత్రపటానికి జ్యోతి ప్రజ్వలన చేశారు.అనంతరం ఏర్పాటు చేసిన సమావేశంలో ఎమ్మెల్యే నారాయణరెడ్డి విద్యార్థులను ఉద్దేశించి ప్రసంగించారు.ప్రపంచం ఎంతో పెద్దదని,విద్యార్థులకు భవిష్యత్తులో అనేక అవకాశాలు ఉన్నాయని అన్నారు.విద్యార్థులు తాము ఎంచుకున్న కోర్సును ఇష్టపడి,ఏకాగ్రతతో చదివితే అనుకున్న లక్ష్యాన్ని సాధించి విజయం సాధించవచ్చని సూచించారు. ఎన్నో సంవత్సరాల పోరాటం అనంతరం తలకొండపల్లి మండలంలో ప్రభుత్వ జూనియర్ కళాశాల ఏర్పాటైందని,ఇక్కడ చదువుకునే ప్రతి విద్యార్థి ఉన్నత స్థానాలకు ఎదగాలని ఆకాంక్షించారు. కళాశాల అభివృద్ధికి యూఎస్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో లక్షల రూపాయలు ఖర్చు చేస్తున్నారని,వారి సహకారాన్ని గుర్తించి విద్యార్థులు కష్టపడి చదివి కళాశాలకు మంచి పేరు తీసుకురావాలని కోరారు. కార్యక్రమంలో తలకొండపల్లి ప్రభుత్వ జూనియర్ కళాశాల ప్రిన్సిపాల్ చరణ్ చారి,ఆమనగల్ ప్రిన్సిపాల్ మాధవరావు,కళాశాల స్పెషల్ డ్రైవ్ ఇంచార్జ్ షణ్ముఖరెడ్డి,యూఎస్ ఫౌండేషన్ చైర్మన్ ఎర్ర సుధాకర్ రెడ్డి,సెక్రటరీ రఘుపతి,స్థానిక సర్పంచ్ శేఖర్ యాదవ్,ఆమనగల్ మున్సిపల్ కౌన్సిలర్ పాపిశెట్టి రాము,ఏఎంసీ చైర్మన్ యాట గీత నరసింహ,కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు శ్రీనివాస్ రెడ్డి,మాజీ అధ్యక్షుడు ప్రభాకర్ రెడ్డి,మాజీ సర్పంచ్ మోహన్ రెడ్డి,డిసిసి ప్రధాన కార్యదర్శి రఘురాములు,డిసిసిఉపాధ్యక్షులు భగవాన్ రెడ్డి,ఏఎంసి డైరెక్టర్ అంజయ్య గుప్తా,అజీమ్,వెంకట్ రెడ్డి,బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షురాలు రమాదేవి,డిగ్రీ కృష్ణ,సర్పంచ్ కడారి రాము యాదవ్,రాజేందర్ నాయక్,కళాశాల చైర్మన్ సరిత,వార్డు సభ్యులు,అధ్యాపకులు,విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.



# అల్కాపూర్ టౌన్‌షిప్‌లో డీసీ లక్ష్మారెడ్డి పర్యటన



**రాజేంద్రనగర్,అక్టోబర్1(జనంసాక్షి) :** "మన వార్డు--మన సమస్యలు" కార్యక్రమంలో భాగంగా డిప్యూటీ కమిషనర్ లక్ష్మారెడ్డి అల్కాపూర్ టౌన్‌షిప్‌లో పర్యటించి, స్థానిక అభివృద్ధి, మౌలిక వసతుల సమస్యలను పరిశీలించారు. ఈ సందర్భంగా నెక్నాంపూర్ డివిజన్ కాంగ్రెస్ అధ్యక్షుడు జితేందర్, అతర్వా అధ్యక్షుడు అర్వపల్లి వంశీ, కార్యవర్గ సభ్యులు, స్థానిక నివాసితులు సమస్యలను అధికారుల దృష్టికి తీసుకెళ్లారు. టౌన్‌షిప్‌లో పెండింగ్‌లో ఉన్న రోడ్లు, డ్రైనేజీ, రోడ్డు కనెక్టివిటీ, పారిశుధ్యం, వీధి దీపాలు, చెరువుల శుభ్రత, వీధి కుక్కలు, దోమల నియంత్రణ తదితర సమస్యలపై చర్చించారు. ఇప్పటికే టెండర్లు పూర్తైన పనులను ఆలస్యం లేకుండా ప్రారంభించి త్వరగా పూర్తి చేయాలని కోరారు. రోడ్ నంబర్ 30 డ్రైనేజీ డైవర్షన్ పనులను 45 రోజుల్లో పూర్తి చేస్తామని డీసీ హామీ ఇచ్చారు. రోడ్ నంబర్ 4కు టెండర్ ప్రక్రియ కొనసాగుతోందని, సాన్వి శాండ్‌ఫీల్డ్స్ అపార్ట్‌మెంట్స్ ముందు రోడ్డు, వారధి రోడ్డు తదితర పనులను కూడా త్వరలో చేపడతామని తెలిపారు. రోడ్ నంబర్ 13 నుంచి బిఆర్సీ వరకు కనెక్టివిటీ, రోడ్ 17--19 మధ్య కనెక్టివిటీ, రోడ్ 19లో మిగిలిన పనులు పూర్తి చేయాలని ప్రతినిధులు కోరారు. రోడ్ నంబర్ 30ను మాస్టర్ ప్లాన్‌లో చేర్చినట్లు, నార్సింగి రోడ్డుతో అనుసంధానానికి భూసేకరణ అవసరమని తెలిపారు. అలాగే నెక్నాంపూర్ చెరువు బండ్‌పై రోడ్డు నిర్మాణ ప్రతిపాదనతో ట్రాఫిక్‌ను మళ్లించే అవకాశం ఉందని వివరించారు. టౌన్‌షిప్‌లో కమ్యూనిటీ హాల్ నిర్మాణానికి కేటాయించిన స్థలాన్ని కూడా డీసీ పరిశీలించారు. అమెనిటీస్ ల్యాండ్ కేటాయింపు అంశం ప్రస్తుతం హెచ్ఎండిఏ కమిషనర్ పరిశీలనలో ఉందని, సమస్య పరిష్కారానికి అధికారులతో చర్చిస్తామని తెలిపారు.

# కీసరలో కాంగ్రెస్‌కు షాక్.. బీజేపీలోకి పలువురు నేతలు

## ఈటల సమక్షంలో బీజేపీలోకి పలువురు నేతలు



**కీసర, అక్టోబర్ 01 (జనంసాక్షి) :** కీసర, యాదగిరిపల్లి గ్రామాలకు చెందిన పలువురు నాయకులు, కార్యకర్తలు బీజేపీలో చేరారు. కీసర డివిజన్ బీజేపీ అధ్యక్షుడు కోల బాలరాజ్ యాదవ్ ఆధ్వర్యంలో గురువారం మల్కాజ్‌గిరి ఎంపీ ఈటల రాజేందర్ సమక్షంలో పార్టీలో చేరార కీసర సర్కిల్ కీసర డివిజన్ పరిధి లోని కీసర గ్రామానికి చెందిన కాంగ్రెస్ పార్టీ మాజీ ఉపసర్పంచ్ కందాడి బాలమణి ప్రభాకర్ రెడ్డి, మాజీ వార్డు సభ్యులు కళాసకం వినోద్ కుమార్, ఎం.వెంకటేశ్వరరావు, ఆర్.కొండల్ రెడ్డి, కే.కృష్ణారెడ్డి, కొరడి ఆంజనేయులు, రామారం రమేష్ తదితరులు బీజేపీ తీర్థం పుచ్చుకున్నారు. యాదగిరిపల్లి గ్రామం నుంచి మాజీ వార్డు సభ్యుడు బోయిని భాస్కర్ ముదిరాజ్, లెక్చరర్ కొమ్ము చిరంజీవి, యువ నాయకులు బోయిన రాంబాబు, లింగంతో పాటు పలువురు కార్యకర్తలు బీజేపీలో చేరారు. వారికి ఎంపీ ఈటల రాజేందర్ కాషాయ కండువాలు కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. ఈ సందర్భంగా బీజేపీ జిల్లా అధ్యక్షుడు బుద్ధి శ్రీనివాస్, సీనియర్ నాయకుడు కౌకుట్ల చంద్రారెడ్డి, రాష్ట్ర కార్యవర్గ సభ్యులు ఏనుగు సుదర్శన్ రెడ్డి, సింగిరెడ్డి వెంకట్ రెడ్డి, జిల్లాల తిరుమలరెడ్డి, జిల్లా కార్యదర్శి బోద శ్రీనివాసరావు, జిల్లా నాయకులు మెట్టు కృష్ణయాదవ్, దొబ్బల శ్రీశైలం, ఏలూరు సత్యనారాయణ, తర్రె సత్యనారాయణ, చంద్రమౌళి, సత్యనారాయణ, తర్రె కృష్ణయాదవ్, లింగం ముదిరాజ్ తదితరులు పాల్గొన్నారు.

**641జీవో రద్దు అయ్యే వరకు..**

# అధికారులందరినీ ఢిల్లీకి ఎత్తుకుపోతా

- ఈ అధికారులను ప్రతి నెల రెండుసార్లు ఢిల్లీకి గుంజుత
- ఈ కమిషన్ ఉన్నదే గిరిజనులకు ఆదివాసులకు న్యాయం చేయడం కోసం..
- జాతీయ ఎస్సీ, ఎస్టీ, కమిషన్ సభ్యులు జాటోతో హుస్సేన్ నాయక్ హెచ్చరిక
- లంచాలు ఇవ్వనిదే అధికారులు పనిచేయడం లేదు



**రంగారెడ్డి జిల్లా ప్రతినిధి: (జనంసాక్షి)** రంగారెడ్డి జిల్లా కొత్తూరు మండలం సిద్దాపూర్ శివారులో ప్రభుత్వం ఏర్పాటు చేస్తున్న డంపింగ్ యార్డును ప్రభుత్వ నిర్ణయాన్ని ప్రభుత్వం వెనక్కి తీసుకోకపోతే 641జివో రద్దు కాకపోతే ఇక్కడి అధికారులను నేరుగా ఢిల్లీకి ఎత్తుకుపోతానని అధికారులను ప్రతినెల రెండుసార్లు ఢిల్లీకి గుంజుతానని ఇది రాసి పెట్టుకోవాలన్నారు జాతీయ ఎస్సీ ఎస్టీ కమిషన్ సభ్యులు జాటోతు హుస్సేన్ నాయక్ ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ అధికారులు పని తీరుపై అసహనం వ్యక్తం చేశారు అధికారులు తప్పించుకోవడానికి వీలు లేదన్నారు,ఆ కోర్టులో లాయర్ పోవాలి ఈ కోర్టుకు నేరుగా అధికారులే రావాలి ఈ విషయం అధికారులకు కూడా బాగా తెలుసు తప్పించుకోవడానికి ఆస్కారమే లేదని జాతీయ ఎస్సీ ఎస్టీ కమిషన్ సభ్యులు జాటోతో హుస్సేన్ నాయక్ ప్రభుత్వ అధికారులకు హెచ్చరికలు జారీ చేశారు ఈ కమిషన్ ఉన్నదే గిరిజనులకు ఆదివాసులకు న్యాయం చేయడం కోసమన్నారు నిజాయితీ ఎప్పుడైనా నిలబడుతుందని అబద్దానికి ఆస్కారమే లేదన్నారు ఈ సిద్ధాపూర్ లో డంపింగ్ యార్డ్ వస్తే ఈ ప్రాంతమంతా సర్వనాశనం అయిపోతుందన్నారు ఈ సిద్దాపూర్ డంపింగ్ యార్డును ముఖ్యమంత్రి కొడంగల్ లో, లేదంటే రాచకొండ గుట్టలో వేసుకోవాలన్నారు గిరిజనులకు కొట్లాడడం కొత్తమికాదన్నారు గిరిజనులు ఆదివాసులు పులులతోనే కొట్లాడారున్నారు తోడేళ్లతో కొట్లాడాలేమా అంటూ ఆగ్రహం వ్యక్తం చేశారు ఈ ప్రభుత్వం వస్తూ వస్తూ హైడ్రా తెచ్చి బెదిరించి ప్రజలను ఆగం చేసిందన్నారు అమాయకులను బలి చేసిందన్నారు 22(ఎ )తో కోటి 24లో లక్షల ఎకరాలను నిషేధిత జాబితాలో ప్రభుత్వం చేర్చిందన్నారు గతంలో ధరణి తెచ్చి అమాయకులను ఇబ్బందులకు గురి చేసిన ఆ ప్రభుత్వం ప్రస్తుతం భూభారతి తెచ్చి రైతులకు ఏం న్యాయం చేశారో చెప్పాలన్నారు సంతకాలు పెట్టాలంటే ప్రభుత్వ అధికారులకు లంచాలు ఇవ్వకుండా ఒక్క సంతకం కూడా అధికారులు పెట్టడం లేదన్నారు ఓవైపు ఫ్యూచర్ సిటీ మరోవైపు డంపింగ్ యార్డ్ మధ్య గిరిజనులు పేద అమాయక ప్రజలు నలిగిపోతున్నారన్నారు.



# అక్రమ వెంచర్లపై తూతూ మంత్రంగా కూల్చివేతలు

**రాజేంద్రనగర్,అక్టోబర్1(జనంసాక్షి) :** జిహెచ్ఎంసి రాజేంద్రనగర్ సర్కిల్ పరిధిలోని గంధంగూడ సర్వే నంబర్ 38లో నాలుగు ఎకరాల విస్తీర్ణంలో అనుమతులకు విరుద్ధంగా వెలిసిన అక్రమ లేఔట్ వెంచర్లలోని నిర్మాణాంను జిహెచ్ఎంసి రాజేంద్రనగర్ సర్కిల్ అధికారులు గురువారం కూల్చివేశారు. అయితే కూల్చివేతలు నామమాత్రంగానే జరిగాయని స్థానికులు ఆరోపించారు. అక్రమ లేఔట్లలో నిబంధనలకు విరుద్ధంగా నిర్మాణాలు చేపట్టినప్పటికీ అధికారులు పూర్తి స్థాయిలో చర్యలు తీసుకోకుండా అక్రమార్కులకు వత్తాసు పలుకుతున్నారని స్థానికులు మండిపడ్డారు. ఇప్పటికైనా ఉన్నతాధికారులు స్పందించి అక్రమ లేఔట్లలోని నిర్మాణాలను పూర్తిస్థాయిలో తొలగించి, బాధ్యులపై చర్యలు తీసుకోవాలని స్థానికులు కోరుతున్నారు.

# బిజెపి ఓబీసీ మోర్చా నాగర్ కర్నూల్ జిల్లా వైస్ ప్రెసిడెంట్‌గా తిర్మణి రవిగౌడ్ నియామకం



**తలకొండపల్లి అక్టోబర్ 01(జనంసాక్షి) :** భారతీయ జనతా పార్టీ ఓబీసీ మోర్చా నాగర్ కర్నూల్ జిల్లా వైస్ ప్రెసిడెంట్ గా తలకొండపల్లి మండల కేంద్రానికి చెందిన భాజాపా సీనియర్ నాయకులు తిర్మణి రవిగౌడ్ ను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. నాపై నమ్మకం ఉంచి ఈ గురుతర బాధ్యతను అప్పగించిన బీజేపీ రాష్ట్ర నాయకత్వానికి,ఓబీసీ మోర్చా రాష్ట్ర నాయకులు,నా రాజకీయ మార్గదర్శకులు తల్లోజు ఆచారికి,నాగర్ కర్నూల్ జిల్లా పార్టీ నాయకత్వానికి,ఓబీసీ మోర్చా రాష్ట్ర నాయకత్వానికి ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు.అలాగే నా నియామకానికి సహకరించి,అండగా నిలిచిన జిల్లా అధ్యక్షులు జెట్టి వెంకటేష్,జిల్లా,మండల నాయకులకు,ప్రతి ఒక్క కార్యకర్తకు పేరుపేరునా ధన్యవాదాలు తెలిపారు.పార్టీ నాకు అప్పగించిన ఈ బాధ్యతను ఒక పదవిగా కాకుండా,ఓబీసీ సమాజానికి,భారతీయ జనతా పార్టీకి సేవ చేసే గొప్ప అవకాశంగా భావిస్తున్నాను.పార్టీ సిద్ధాంతాలకు కట్టుబడి,పెద్దల మార్గదర్శకత్వంలో,కార్యకర్తల సహకారంతో నాగర్ కర్నూల్ జిల్లాలో ఓబీసీ మోర్చాను మరింత బలోపేతం చేసేందుకు నా వంతు శాయశక్తులా కృషి చేస్తానని పేర్కొన్నారు.

# ప్రగతినగర్‌లో సీసీ రోడ్డు అభివృద్ధి పనులకు శంకుస్థాపన

**కుతుబుల్లాపూర్ అక్టోబర్ 1(జనంసాక్షి) :** కుత్బుల్లాపూర్ నియోజకవర్గ 276వ ప్రగతి నగర్ డివిజన్‌లోని జయ ఆర్కేడ్ మొదలై వింధ్య ఫ్రైడ్ వరకు సీఎంసీ నిధులు రూ.12 లక్షలతో చేపట్టనున్న సీసీ రోడ్డు అభివృద్ధి పనులకు గురువారం కుత్బుల్లాపూర్ నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ ఇన్‌చార్జి కొలన్ హన్మంత్ రెడ్డి శంకుస్థాపన చేసి పనులను ప్రారంభించారు. ఈ సందర్భంగా కొలన్ హన్మంత్ రెడ్డి మాట్లాడుతూ, ప్రజలకు మెరుగైన మౌలిక సదుపాయాలు కల్పించడమే లక్ష్యంగా కాంగ్రెస్ పార్టీ కృషి చేస్తోందని, ప్రజల అవసరాలకు అనుగుణంగా అభివృద్ధి పనులకు ప్రాధాన్యతనిస్తూ, నియోజకవర్గ అభివృద్ధికి నిరంతరం కృషి చేస్తామని తెలిపారు. బొమ్ము వెంకటేశ్వర్ రెడ్డి అధ్యక్షతన నిర్వహించిన ఈ శంకుస్థాపన కార్యక్రమంలో సీనియర్ కాంగ్రెస్ నాయకులు, మహిళా నాయకులు, స్థానిక కాంగ్రెస్ నాయకులు, పార్టీ కార్యకర్తలు మరియు కాలనీ ప్రజలు పాల్గొన్నారు.